RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 326 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 డిసెంబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## ప్రపంచంలో ఉత్తమ దేశం స్విట్జర్లాండ్

న్యూఢిల్లీ : ప్రపంచంలో ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపికయింది. యూఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్ సంస్థ 2024 సంవత్సరానికి నిర్వహించిన ఉత్తమ దేశాల ర్యాంకింగ్‌ల్లో ఈ స్థానం లభించింది. ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపిక కావడం వరుసగా ఇది మూడోసారి కావడం విశేషం. ఆ తరువాతి స్థానాల్లో జపాన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలు ఉన్నాయి. భారత్‌కు 33వ స్థానం దక్కింది. గత ఏడాదితో పోల్చితే మూడు ర్యాంకులు తగ్గాయి. మొత్తం 89 దేశాల్లో సర్వే జరిపి ర్యాంకులు ఇచ్చారు. జీవన ప్రమాణాలు, సాహసాలు, వారసత్వం, వ్యాపార దక్షత, సాంస్కృతిక ప్రయోజనం తదితర పది అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రజాభిప్రాయం సేకరించారు. స్విట్జర్లాండ్‌లో జీవన నాణ్యత, వాణిజ్యంలో పారదర్శకత బాగున్నట్టు తేలింది. భారత్ విషయానికి వస్తే 'మూవర్స్', 'వారసత్వం' అంశాల్లో మార్కులు వచ్చాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి పరిస్థితులకు త్వరగా అలవాటు పడేవారిని 'మూవర్స్'గా నిర్వచించారు.

# సంక్రాంతి నుంచి రైతుభరోసా!

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయం వేదికగా జరిగిన తెలంగాణ క్యాబినెట్ భేటీ ముగిసింది. సుదీర్ఘంగా 4 గంటల పాటు కొనసాగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి ఆమోద ముద్ర వేసింది. ఐదు ఆర్డినెన్స్ లకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. 5 ఆర్డినెన్స్ లకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రైతుభరోసా అంశంపై క్యాబినెట్ లో చర్చ జరిగింది. సంక్రాంతి నుంచి రైతుభరోసా అమలుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు ఆర్వోఆర్ చట్టంపైనా మంత్రి మండలిలో సుదీర్ఘంగా చర్చ జరిగింది.

**క్యాబినెట్ కీలక నిర్ణయాలు..** పంచాయతీ రాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్ కు క్యాబినెట్ ఆమోదం. స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లుకు ఆమోదం. ముఖ్యంగా రైతు భరోసాపై క్యాబినెట్లో కీలకంగా చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లో సంకాంత్రి నుంచి అందజేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

అంతేకాదు.. ఆర్వోఆర్ చట్టంపైనా సుదీర్ఘంగా చర్చించారు. ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనానికి ఆమోదం తెలిపారు.

**భూమి లేని పేదలకు గుడ్ న్యూస్.. కేబినెట్ కీలక నిర్ణయం :** భూమి లేని పేదలకు తెలంగాణ రాష్ట్ర కేబినెట్ గుడ్ న్యూస్ చెప్పింది. ఇటీవలే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భూమి లేని ప్రతీ కుటుంబానికి రూ.12 వేలు ఇస్తామని.. రెండు విడుతలుగా రూ.12వేలు ఇస్తామని చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా కేబినెట్ లో ఈనెల 28న భూమి లేని వారికి రూ.6వేలు ఇవ్వాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా 5 ఆర్డినెన్స్ లకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా పంచాయతీ రాజ్ సవరణ చట్టం, ఆర్వోఆర్ చట్టం పై సుదీర్ఘంగా చర్చించారు. ఓఆర్ఆర్ పరిధిలో 51 గ్రామపంచాయతీలను సమీప మున్సిపాలిటీలలో విలీనానికి ఆమోదం తెలిపారు. తెలంగాణ వస్తు సేవల పన్ను, జీతాలు పెన్షన్ల పెంపు, పురపాలక సంఘాల సవరణ తదితర బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సంక్రాంతి పండుగ తరువాత రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నట్టు కేబినెట్ నిర్ణయం తీసుకున్నారు.




**ఈ-కార్ రేసు వ్యవహారం.. చట్టప్రకారమే దర్యాప్తు: పొంగులేటి...** ఈ-కార్ రేసు వ్యవహారంలో చట్టప్రకారమే దర్యాప్తు కొనసాగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేటీఆర్‌ను విచారించేందుకు అనుమతి ఇప్పటికే లభించిందని, గవర్నర్ అనుమతి ఇస్తూ జారీ చేసిన దస్త్రాన్ని ఇవాళ రాత్రి, లేదా మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏసీబీకి పంపిస్తారని చెప్పారు. చట్టప్రకారం ఏసీబీ దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " గవర్నర్ అనుమతిపై కేబినెట్‌లో చర్చ జరిగింది. ఈ వ్యవహారంలో జరిగిన దోపిడీపై కేబినెట్‌లో చర్చించాం. కేటీఆర్ అరెస్టుపై నేనేమీ చెప్పలేను. చట్టం తన పని తాను చేస్తుంది. బాంబు తుస్సుమందని ఇటీవల భారాస నేతలు వ్యాఖ్యానించారు. అది తుస్సుమనేదైతే.. దిల్లీ చుట్టూ ప్రదక్షిణ ఎందుకు చేశారు? అసెంబ్లీలో ఎమ్మెల్యేల్లా కాకుండా గూండాల్లా ప్రవర్తించారు. మాట్లాడటానికి అంశం లేనందుకే ప్లకార్డులు, నినాదాలతో సభకు ఆటంకం కలిగించారు. ఈ సమావేశాల్లో ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెడతాం. ఇందిరమ్మ ప్రభుత్వంలో కక్ష సాధింపు ఉండదు. ప్రధానమైన అవినీతిని ప్రజల ముందు ఉంచుతున్నాం" అని పొంగులేటి తెలిపారు.


హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లానూ రద్దు చేయదని మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి స్పష్టం చేశారు. పాత జిల్లాలను రద్దు చేయాల న్న ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని చెప్పారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం వద్దకు నిధుల కోసం తరచూ వెళ్తాయని.. వెళ్లిన ప్రతిసారీ నిధులు రావని చెప్పా రు. గతంలో భారాస హయాంలో ఎన్ని నిధులు వచ్చాయో తెలుసని ఎద్దేవా చేశారు. ఇది పేదల ప్రభుత్వమని.. పేదల కోసం పని చేస్తుందని పేర్కొన్నారు.




# నేడు లోక్‌సభ ముందుకు...

## వన్‌నేషన్ - వన్‌ఎలక్షన్ బిల్లు..!

దిల్లీ: లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రణాళిక ఎట్టకేలకు పార్లమెంట్ ముందుకురానుంది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లు ను కేంద్రం మంగళవారం (డిసెంబరు 17న) లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. ఈమేరకు ప్రభుత్వ అధికారిక వర్గాలు వెల్లడించాయి. అనంతరం దీన్ని ఉభయసభల సంయుక్త కమిటీకి పంపించాలని కేంద్రం సిఫార్సు చేసే అవకాశాలున్నట్లు తెలిపాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ మంగళవారం ఈ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. జమిలి ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలు నెలకొన్నవేళ దీనిపై విస్తృత సంప్రదింపుల కోసం బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించాలని స్పీకర్ ఓం బిర్లాను కేంద్రమంత్రి అభ్యర్థించనున్నారు. అనంతరం దీనిపై ప్యానెల్ కమిటీ ఏర్పాటుకు సభ్యులను ప్రతిపాదించాలని సభాపతి పార్టీలను కోరనున్నారు. సాయంత్రానికి కమిటీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉంది. పార్లమెంట్‌లో పార్టీల సంఖ్యాబలం ఆధారంగా కమిటీలో వారికి చోటు దక్కుతుంది. అంటే అతిపెద్ద పార్టీ అయిన భాజపా నుంచి ఒక ఎంపీ కమిటీ ఛైర్మన్‌గా ఉంటారు. లుత ఈ ప్రతిపాదిత కమిటీకి 90 రోజుల సమయం కేటాయిస్తారు. అవసరాన్ని బట్టి ఆ తర్వాత దాన్ని పొడిగిస్తారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో జమిలి ప్రణాళికకు ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టి.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన రెండు బిల్లులను కేంద్ర కేబినెట్ ఈనెల 12న ఆమోదించింది. వీటిని ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే లోక్‌సభ ముందుకుతీసుకురావాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉంది. ప్రస్తుత శీతాకాల సమావేశాలు ఈనెల 20తో ముగియనున్నాయి.







హైదరాబాద్: తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సోమవారం ఇంటర్‌బోర్డు వెల్లడించింది. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో ప్రాక్టికల్స్ జరగనున్నాయి. జనవరి 29న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జరగనుంది.

**ఇంటర్ మొదటి సంవత్సరం..** 05-03-2025 - సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1, 07-03-2025 - ఇంగ్లిష్ పేపర్-1, 11-03-2025 - గణితం పేపర్-1ఏబీ బోటనీ పేపర్-1బీ పొలిటికల్ సైన్స్ పేపర్-1, 13-03-2025 - గణితం పేపర్ -2బిబీ జువాలజీ పేపర్-1బీ హిస్టరీ పేపర్-1, 17-03-2025 - ఫిజిక్స్ పేపర్-1బీ ఎకనామిక్స్ పేపర్-1, 19-03-2025 - కెమిస్ట్రీ పేపర్-1బీ కామర్స్ పేపర్-1, 21-03-2025 - పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1బీ బ్రిడ్జ్ కోర్సు గణితం పేపర్-1 (బైపీసీ విద్యార్థులకు), 24-03-2025 - మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1బీ జాగ్రఫీ పేపర్-1

**ఇంటర్ ద్వితీయ సంవత్సరం...** 06-03-2025 - సెంకడ్ లాంగ్వేజ్ పేపర్-2, 10-03-2025 - ఇంగ్లిష్ పేపర్-2, 12-03-2025 - గణితం పేపర్-2ఏబీ బోటనీ పేపర్-2బీ పొలిటికల్ సైన్స్ పేపర్-2, 15-03-2025 - గణితం పేపర్ -2బిబీ జువాలజీ పేపర్-2బీ హిస్టరీ పేపర్-2, 18-03-2025 - ఫిజిక్స్ పేపర్-2బీ ఎకనామిక్స్ పేపర్-2, 20-03-2025 - కెమిస్ట్రీ పేపర్-2బీ కామర్స్ పేపర్-2, 22-03-2025 - పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2బీ బ్రిడ్జ్ కోర్సు గణితం పేపర్-2 (బైపీసీ విద్యార్థులకు), 25-03-2025 - మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2బీ జాగ్రఫీ పేపర్-2

## కౌశిక్‌రెడ్డి మొబైల్‌ను తిరిగి ఇచ్చేయండి.. పోలీసులకు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్: బంజారాహిల్స్ సీఐ విధులకు ఆటంకం కలిగించారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన మొబైల్‌ను తిరిగి ఇచ్చేయాలని పోలీసులను ఆదేశించింది. దర్యాప్తులో భాగంగా అతడి ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా మొబైల్‌ను లాక్కున్నారంటూ కౌశిక్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. మొబైల్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపాల్సి ఉంటుందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన కుట్రలు పన్నుతున్నారని వాదించారు. ఫోన్ సీజ్ చేయాల్సి వస్తే నిబంధనల ప్రకారం నోటీసులిచ్చి తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది.



# జనాల్లోకి కాదు... అమెరికాకు....!

## మనవడి దగ్గరకు పయనమవుతున్న కేసీఆర్!

### మూడు మాసాలు అక్కడే!! - వైద్య పరీక్షలు, మనవడికి అధిక సమయం కేటాయింపు!!

హైదరాబాద్ : వచ్చే ఏడాది కేసీఆర్ జనంలోకి వస్తారని కాచుకోవాలని కాంగ్రెస్ కు కేటీఆర్ సవాల్ చేస్తున్నారు కానీ ఆయన అమెరికా వెళ్లిపోతున్నారు. ఆయన అమెరికా పర్యటన, వీసా ఏర్పాట్లు అన్నీ పూర్తయిన తర్వాత ఈ విషయం లీక్ చేశారు. బహుశా.. ఆయన అమెరికా వెళ్లిపోయిన తర్వాత అప్పుడు అసలు సమాచారం అధికారికంగా చెబుతారేమో. అమెరికాలో దాదాపుగా మూడు నెలలు ఉండాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారని అంటున్నారు. వైద్య చికిత్సతో పాటు మనవడు హిమాన్షు తో ఎక్కువ సమయం గడిపేలా ఆయన టూర్ ప్లాన్ చేసుకున్నారు.

విదేశీ పర్యటనలు అంటే కేసీఆర్‌కు పెద్దగా ఇష్టం ఉండదు. ఆయన మొదట్లో గల్ఫ్ ఏజెంటు గా పని చేశారని చెప్పుకుంటారు. అయినా ఆయన విదేశాలకు వెళ్లింది చాలా తక్కువ. పదేళ్ల సీఎంగా ఉన్న సమయంలో ఆయన రెండు సార్లు మాత్రమే విదేశీ పర్యటనకు వెళ్లారు. అమెరికాకు మొదటి సారిగా వెళ్తున్నారు. ఈ సారి పర్యటన పూర్తిగా వ్యక్తిగతం. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ముగిసినప్పటి నుండి ఆయన ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ప్రతిపక్ష నేతగా ఉన్న ఆయన అసెంబ్లీకి రావాలని కాంగ్రెస్ నేతలు పదే పదే సవాళ్లు చేస్తున్నారు., కేసీఆర్ రావాల్సిన అవసరం లేదని కేటీఆర్ లాంటి వారు కౌంటర్లు ఇస్తున్నారు. అయితే వచ్చే ఏడాది జనంలోకి వస్తారని అనుకున్నారు. భారీ బహిరంగసభను ప్లాన్ చేశారని చెప్పుకున్నారు. కానీ ఆయన మాత్రం అమెరికాకు వెళ్లే ప్లాన్ లో ఉన్నారు.

# 'లెక్క' తప్పిందెక్కడ..?

భద్రాచలం : విభాగాల మధ్య సమన్వయం లోపించటంతో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలకు సరఫరా అయ్యే సరుకులకు సంబంధించిన లెక్కలపై అయోమయం నెలకొంది. తాము అందించిన నిత్యావసర సరుకులకు సరిపడా పైకం రాలేదని కొందరు వ్యాపారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. భారీస్థాయిలో బకాయిలు పేరుకుపోయాయని, చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. లోపమెక్కడ ఉందో తేల్చేందుకు అధికారులు పూనుకున్నారు. బుధ, గురువారాల్లో ఇదే పనిలో నిమగ్నమై రూ.కోట్ల జమ ఖర్చుల పత్రాలను పరిశీలించారు. 2022 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు గల లెక్కలపై సందిగ్ధం నెలకొంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని దాదాపు 80 గిరిజన విద్యాలయాల్లో 25వేల మంది విద్యార్థులకు సంబంధించిన అంశమవటంతో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పైకి చెప్పనప్పటికీ కొన్ని లొసుగులు ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలినట్లు సమాచారం.

**ఇదీ సంగతి** ప్రతి మూడునెలలకు ఒకసారి వ్యాపారులు టెండర్ ద్వారా హక్కులు పొంది ఉప్పు, పప్పు, చింతపండు, నూనె వంటి నిత్యావసరాలను గిరిజన సహకార సంస్థ (జీసీసీ)కి పంపిస్తారు. నవంబర్‌తో గడువు పూర్తయినప్పటికీ డిసెంబర్ వరకు ఈ హక్కులను అధికారులు పొడిగించారు. మెనూ ఛార్జీలు పెరిగిన తరుణంలో ఇదో తరహా ప్రత్యేకత. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు జీసీసీ సరుకులు



అందిన తర్వాత విద్యాలయం నిర్వాహకులు ఈమొత్తానికి బిల్లు రూపంలో ట్రెజరీకి పంపిస్తారు. ట్రెజరీ నుంచి జీసీసీకి చెల్లింపులయ్యాక ఆపైకాన్ని వ్యాపారులకు చేరవేస్తారు. అయితే కొన్ని వస్తువులకు సంబంధించిన బకాయిలు పేరుకుపోయాయి.

ట్రెజరీలో కొన్ని బిల్లులు వివిధ కారణాలతో పాస్ కాకుండా ఆగుతుంటాయి. కొన్ని బిల్లులు పాసైనప్పటికీ ఏ విద్యాలయం నుంచి వచ్చాయో తెలుసుకోవటం లేదు. జీసీసీ, వ్యాపారులకు మధ్య చెల్లింపుల్లోనూ తేడాలు ఉన్నాయి. దీనిపై త్వరలో స్పష్టత రానుంది.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు రూ.9కోట్ల నిత్యావసర సరుకుల ను జీసీసీ నుంచి అన్నిరకాల గిరిజన విద్యాలయాలకు అందించారు. పాత బకాయిలతో సహా రూ.13కోట్లు జీసీసీకి రావాల్సి ఉంది.గడిచిన రెండేళ్ల లెక్కలన్నీ తమ వద్ద పక్కాగా ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి రూ.6 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు అందిన వెంటనే జీసీసీకి చెల్లిస్తాం. మణెమ్మ, డీడీ, ఐటీడీఏ

చెల్లింపుల అంశంలో ఎక్కడ తేడా వచ్చిందో గుర్తిస్తాం. తదనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తాం.సమ్మయ్య, జీసీసీ డీఎం

# 60 ఏళ్ల సంబురాలకు వేళాయె

అశ్వారావుపేట : ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1964లో నెలకొల్పారు. ఇది ఏర్పడి 60 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించ నున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని వివిధ వ్యవసాయ కళాశాలల్లో సంబరాలు జరుపుకోవాలని అధికారులు నిర్ణయించారు. అశ్వారావుపేటలో వ్యవసాయ కళాశాల ఏర్పాటై 35ఏళ్లు అవుతోంది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హామీ, తుమ్మల చొరవతో కళాశాల ఏర్పాటుకు బీజం పడింది. 'ఈ ఏడాదే కళాశాల తరగతులు ప్రారంభించాలి, చేయగలరా' అని మంత్రి మండలి సమావేశంలో 1989లో అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రశ్నించారు. నాడు మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు 'ఈ ఏడాది, ఈ నెలలోనే తరగతులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని బదులిచ్చారు. కళాశాల మంజూరు కావడం, అదే ఏడాది తరగతులు ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి. అప్పట్లో ఇదొక సంచలనం. కళాశాల వచ్చాక ఈ ప్రాంత వ్యవసాయ పంటల తీరు మారింది.

కళాశాలలో ఇప్పటి వరకు 30 బృందాలు ఏజీబీఎస్సీ పూర్తి చేసుకున్నాయి. ఇక్కడ చదువుకున్న విద్యార్థుల్లో దాదాపు నూరుశాతం మంది మంచి శాస్త్రవేత్తలుగా, దేశవిదేశాల్లో, రైల్వే, పోలీసు, బ్యాంకింగ్, నాబార్డుల్లో, ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా, ఇక్రిశాట్‌లాంటి సంస్థల్లో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. వారిలో ముఖ్యంగా రాష్ట్ర అదనపు డీజీగా ఉన్న నాగిరెడ్డి ఈ కళాశాల విద్యార్థే. డా.వకుళాభరణం వెంకటరమణ కెనడాలో వ్యవసాయ మంత్రిత్వ శాఖలో ప్రధాన సాంకేతిక మేనేజర్‌గా ఉన్నారు. బెంగళూరులో సగ్రహ మేనేజ్‌మెంటు సంస్థ ద్వారా



హరీశ్‌రఘు సుమారు 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. టెక్సాస్ టెక్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా డా.మెండు వేణుగోపాల్, వ్యవసాయాధార పరిశ్రమల నిర్వాహకుడిగా ఠాగూర్‌వర్మ వందల మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

**ఉద్యాన వనాలు..**

వరి, మామిడి, జీడిమామిడి తోటల స్థానంలో అరటి, కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలు, ఆయిల్‌పాం, కోకో లాంటి పంటలు పెరిగాయి. రాష్ట్రంలోనే ఉద్యాన తోటలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రాంతంగా అశ్వారావుపేట మారింది. రెండు పామాయిల్ పరిశ్రమలు, పట్టుపరిశ్రమ, ఉద్యాన పరిశోధన కేంద్రం, నర్సరీలకు నెలవైంది.

**పతకాల పంట..**

ఈ కళాశాలలో చదివితే శాస్త్రవేత్తగా, ఉన్నత స్థానాల్లో ఉద్యోగం రావడం గ్యారంటీ అని ముద్రపడింది. ఏటా విద్యార్థులు బంగారు పతకాలు సాధిస్తూనే ఉన్నారు. వారిలో నాగిరెడ్డి, వకుళాభరణం వెంకటరమణ, అమరేంద్రరెడ్డి, దొరాజీరావు, అశ్వని, దివ్య, లక్ష్మీరాగసంధ్య, జగదీశ్, స్వామి, నాగస్వాతి, కె.శృతి ఇలా మొత్తం 25సార్లు బంగారు పతకాలు అందుకున్న ఘనత కళాశాలకు దక్కింది. కళాశాలకు సైతం పతకాలు వచ్చాయి. 27సార్లు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుతం 467 మంది విద్యార్థులు ఏజీబీఎస్సీ చదువుతున్నారు.

# భూసారం.. తెలియక నిస్సారం



పరిగి : జిల్లా ప్రజలలో అధిక శాతానికి వ్యవసాయమే ఆధారం. ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేసి సలహాలు ఇచ్చే వారు లేకపోవడంతో తోటి రైతులు ఏ పంట సాగుచేస్తే తామూ అదే వేయడం, దుకాణదారుడు ఇచ్చిన మందులనే వాడటం.. వంటివి చేస్తున్నారు. దీంతో ఎక్కువ మంది నష్టాల పాలవుతున్నారు. ఈ పరిస్థితులు మారాలంటే భూసార పరీక్షలు నిర్వహించి అధికారులు అండగా నిలవాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని పేర్కొంటూ కథనం.

**15ఏళ్ల క్రితం రెండు కేంద్రాల ఏర్పాటు**

నేల గుణగణాలు రైతులకు అందించాలనే ఉద్దేశంతో జిల్లాలోని పరిగి, వికారాబాద్ ప్రాంతాల్లో ప్రభుత్వం 15 ఏళ్ల క్రితం రూ.25లక్షల అంచనా వ్యయంతో భూసార పరీక్ష కేంద్రాలు ప్రారంభించింది. అధికారులు వేసవిలో ప్రత్యేకంగా రైతు సదస్సులను నిర్వహించి మట్టి నమూనాల వల్ల కలిగే ఫలితాలను వివరించే వారు. చాలా మంది తమ పొలాల్లోని మట్టి సేకరించి పరీక్షించుకునేవారు. కొన్నేళ్లుగా పర్యవేక్షణ లోపంతో నిర్వహణలో విఫలమవుతున్నాయి. మట్టి ఫలితాలు ఇప్పుడు చేతికందితే రానున్న ఖరీఫ్‌కు మేలు కలుగుతుంది.

ప్రధాన పంటలుఖరీఫ్... అన్నిరకాల ప్రధానమైనవి.

యాసంగి: వరి, వేరుసెనగ, మొక్కజొన్న, జొన్న, శనగ

రాజేంద్రనగర్‌కు పంపుతున్నాం: లక్ష్మీకుమారి, సహాయ సంచాలకులు

మట్టి నమూనాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. తీసుకువచ్చిన మట్టిని పరీక్ష నిమిత్తం రాజేంద్రనగర్‌లోని పరీక్ష కేంద్రానికి పంపుతున్నాం. జిల్లా కేంద్రాల నిర్వహణపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**ఏడాది నుంచి దాఖలాలు లేవు**

జిల్లాలో ఏడాదిగా భూసార పరీక్షలు నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. ఇందుకు నిధుల లేమి ప్రధాన కారణంగా మారింది. పరీక్షలు లేక ఫలితాలు అందక వేసిన పంటలే వేస్తూ దిగుబడులు తగ్గి రైతులు దిగాలు చెందుతున్నారు.

**లెక్కింపు కేంద్రంగా మార్చారు**

మొన్నటి శాసనసభ ఎన్నికల లెక్కింపు కేంద్రాన్ని పరిగిలో ఏర్పాటు చేయడంతో భూసార పరీక్ష కేంద్రాన్ని కూడా తీసుకున్నారు. ఎన్నికలు ముగిసినా దానికి తాళం తీయకపోవడంతో పరీక్షలు నిర్వహించే వ్యవసాయాధికారితో పాటు ఏఈఓను ఇతర విధులకు పరిమితం చేశారు. వికారాబాద్‌లో అధికారుల కొరత అవరోధంగా మారింది.

# జారీ చేయరు.. జరిమానా వేస్తారు!



కరీంనగర్ : వాహనదారులు రోడ్డెకితే చాలు వారివద్ద వాహన రిజిస్ట్రేషన్, ఇతర పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ఇవి లేకుండా వాహనాలు నడిపితే నిబంధనలకు వ్యతిరేకం. తనిఖీల్లో పట్టుబడితే భారీగా జరిమానా విధిస్తారు. అలాంటిది రవాణాశాఖ కార్యాలయాల నుంచి రావాల్సిన ఆర్సీ, డీఎల్ రోజులు గడుస్తున్నా రాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని సమాచారం. ఆర్సీ, డీఎల్‌ల నిలిపివేతపై కథనం..

**ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి**

కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లో జిల్లా రవాణాశాఖ కార్యాలయాలు.. హుజూరాబాద్, రామగుండం, కోరుట్లలో యూనిట్ కార్యాలయాలు సేవలందిస్తున్నాయి. ఆయా కార్యాలయాల పరిధిలో నిత్యం వందలాది వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం వస్తుంటారు. పది రోజుల్లోపు వాహనదారుల చిరునామాకు తపాలా ద్వారా కార్డులను పంపిస్తుంటారు. ఒక్కో ఆర్టీఏ కార్యాలయ పరిధిలో 100 నుంచి 150 వరకు కార్డులు ప్రింట్ చేస్తుంటారు. ప్రస్తుతం పక్షం రోజులు అవుతున్నా.. వాహనదారులకు కార్డులు చేరలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

**తపాలా శాఖకు చెల్లింపులో జాప్యం**

వాహనదారుల నుంచి తపాలా ఛార్జీల కింద రూ.35 రవాణాశాఖ వసూలు చేసి.. కార్డులను వారి చిరునామాకు పంపించాల్సి ఉంటుంది. అయితే కొంతకాలంగా డబ్బులు చెల్లించకపోవడంతో.. తపాలాశాఖ వాటిని తీసుకోవడం నిలిపివేసింది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ ఆర్టీఏ నుంచి రూ.4 లక్షలు, జగిత్యాల రవాణాశాఖ రూ.2 లక్షలు, రాజన్న సిరిసిల్ల జిల్లా రూ.1.50 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని తెలిసింది. నిధులు రాగానే తపాలా శాఖకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లిస్తామని.. జనవరిలో తపాలాశాఖ కార్యాలయాలకు పెండింగ్‌లో ఉన్న నిధులు చెల్లిస్తామని ఆ శాఖ కమిషనర్ లేఖ రాసినట్లు సమాచారం.

ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం– డీటీసీ పెద్దింటి పురుషోత్తం

డీఎల్, ఆర్సీలను వాహనదారుల చిరునామాకు చేర్చే విషయంపై తపాలా శాఖకు లేఖ రాశాం. ఇబ్బందులు కలగకుండా చూడటానికి ఆ శాఖ అధికారులతో మాట్లాడుతున్నాం. వాహనదారులకు కార్డులు అందేలా చూస్తాం. నిధులు రాగానే తపాలాశాఖకు చెల్లిస్తాం.

# ప్రగతి పథం.. ఉపాధికి ఊతం



గోదావరిఖని : సింగరేణి బొగ్గు గనులున్న ప్రాంతాల్లో ఉత్పత్తి ఉన్నంతకాలం ఆయా పట్టణాలు అభివృద్ధి దిశలో పయనిస్తాయి. బొగ్గు నిల్వలు పూర్తయిన తరువాత అనుబంధ పరిశ్రమలు తరలి వెళ్లడం కార్మికులు వేరే ప్రాంతాలకు వెళ్లిపోవడంతో అభివృద్ధి ఆశించిన మేరకు కనిపించదు. కాగా రామగుండంలో పరిశ్రమలు దినదినాభివృద్ధి చెందుతుండటంతో ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడనున్నాయి. సింగరేణి గనులు, ఎన్టీపీసీ వెలుగులు.. ఆర్‌ఎఫ్‌సీఎల్ ఎరువుల ఉత్పత్తితో పాటు మరిన్ని కొత్త పరిశ్రమలు ఏర్పాటు కానుండటం, వైద్య విద్యకు కేంద్రంగా ఉండటంతో నగర జీవిత కాలం పెరగనుంది. ఆరు దశాబ్దాలుగా ప్రస్థానం సాగిస్తున్న నగరంలో జీవన ప్రమాణాలు మెరుపడే ఆస్కారం ఏర్పడింది.

**మెగా ఓసీపీతో...** సింగరేణి బొగ్గుగనులతో విస్తరించిన రామగుండం ప్రాంతానికి మరో మెగా ఓసీపీ రానుండటంతో కొంత కాలం భవిష్యత్తు పెరగనుంది. రామగుండం ప్రాంతంలో ప్రస్తుతం బొగ్గు నిక్షేపాలు అంతరించిపోతున్న క్రమంలో సింగరేణి కొత్తగా రామగుండంలో మెగా ఓసీపీ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేసింది. ప్రస్తుతం నాలుగు ఉపరితల గనులు, అయిదు భూగర్భ బొగ్గుగనుల ద్వారా బొగ్గును వెలికి తీస్తున్న కొత్తగా రామగుండం మెగా ఓసీపీని ఏర్పాటు చేయనుంది.

**వైద్య విద్యకు కేంద్రం** ఇప్పటికే రామగుండంలో కొనసాగుతున్న వైద్య కళాశాలకు అదనంగా నర్సింగ్ కళాశాల ప్రారంభమైంది. దీనికి తోడు పీజీ కోర్సులతో పాటు దంత వైద్య కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. గోదావరిఖనిలోని వైద్య కళాశాలలో ఉత్తమమైన వైద్య విద్య అందుబాటులో ఉండటంతో విద్యార్థులు అధిక సంఖ్యలో ఇక్కడ ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ప్రాంతంలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరైంది. రామగుండం ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు సైతం ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి.

**మెరుగైన వైద్యం** పారిశ్రామిక ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 200 పడకలు అందుబాటులో ఉన్నాయి. రానున్న కాలంలో మరింత విస్తరించేందుకు పనులు సాగుతున్నాయి. దీనికితోడు 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు కానుండటంతో కార్మిక కుటుంబాలకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. అన్ని విభాగాల వైద్య నిపుణులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇప్పటికే సేవలందిస్తున్నారు.

**మరిన్ని పరిశ్రమలు** రామగుండం ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎన్టీపీసీ విద్యుత్తు కేంద్రంలో కొత్తగా 2400 మెగావాట్ల మూడు యూనిట్లను నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. దీనికి గాను ఈనెల 19న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. తెలంగాణ కోసం ప్రత్యేకంగా నిర్మించే 4000 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాల్లో ఇది వరకే 1600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నిర్మించారు. మరో మూడు 800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించాల్సిన యూనిట్లపై సందిగ్ధం నెలకొన్న క్రమంలో ఇటీవలనే దీనిపై సానుకూలత లభించింది. త్వరలోనే నిర్మాణం చేపట్టే అవకాశం ఉంది. వీటితో పాటు రామగుండంలో జెన్‌కో, సింగరేణి సంయుక్తంగా 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి సూత్రప్రాయంగా అవగాహన కుదిరింది. అదే విధంగా లింగాపూర్‌లో తోలు పరిశ్రమ స్థాపనకు సుముఖత లభించింది. భూసేకరణకు సంబంధించిన ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఆశాఖ ఉన్నతాధికారులు లేఖ రాశారు. **విమానాశ్రయం ఏర్పాటుపై..**ప్రభుత్వ నిర్ణయం అమలైతే పారిశ్రామిక ప్రాంత ప్రజలు వేగంగా మహానగరాలకు చేరుకునే రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఎంతో కాలంగా ఊరిస్తూ వస్తున్న విమానాశ్రయం కల నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని మూడు నగరాలతో పాటు రామగుండంలో విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. ఇప్పటికే ప్రధాన రైలు మార్గం అందుబాటులో ఉన్న రామగుండం ప్రజలకు వైమానిక సేవలు సైతం చేరువకానున్నాయి.

# ఊరిస్తున్న పదవులు

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో రాజకీయ పదవుల పంపకానికి రంగం సిద్ధమవుతోంది. స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా), జిల్లా గ్రంథాలయ సంస్థ పాలకవర్గాలతోపాటు దాదాపు పుష్కరకాలం తర్వాత మళ్లీ భద్రాచలం ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. పాలకవర్గాలు లేని మార్కెట్ యార్డులు, దేవాలయాలకు సైతం త్వరలోనే కమిటీలను ప్రకటిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. వీటితోపాటు రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ పదవులకూ పలువురు ముఖ్యనేతలు పోటీపడుతున్నారు. అమాత్యులను ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు.

**గతంలో ఏకాభిప్రాయం కుదరక..**

స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా), ఖమ్మం, భద్రాద్రి జిల్లాల గ్రంథాలయ సంస్థ ఛైర్మన్లు, పాలకవర్గ సభ్యుల పదవుల కోసం అధికార పార్టీలో చాంతాడంత మంది నాయకులు పోటీపడుతున్నారు. ఖమ్మం నగరం నుంచి సుడా కార్యకలాపాలు సాగటం, ఐదు నియోజకవర్గాలు దీని పరిధిలోకి వస్తుండటంతో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ పాలకవర్గం పదవులకు డిమాండ్ ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా సుడా పాలకవర్గాన్ని ప్రకటించలేదు. గతంలో ఓసారి సుడా పాలకవర్గం కొలువుదీరుతుందనుకున్నా.. పదవుల పంపిణీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవటంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఇతర పోస్టుల భర్తీలోనూ ఇదే తరహా సమస్య తలెత్తటంతో పదవుల పంపకానికి అడ్డుకట్ట పడింది.

**ప్రభుత్వం దృష్టికి ప్రతిపాదనలు..!**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కీలకమైన నామినేటెడ్ పదవుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చజెండా ఊపారు. సుడా, ఉభయ జిల్లాల గ్రంథాలయ సంస్థలు, భద్రాచలం ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ పదవులకు ఒక్కో మంత్రి తమ అనుచరుల పేర్లను సిఫార్సు చేయటంతో సమస్య కొలిక్కి వచ్చినట్లయ్యింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు శ్రమించిన పలువురు నాయకుల పేర్లను పాలకవర్గాల సభ్యుల పదవుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. సుడాకు ఛైర్మన్‌తోపాటు డైరెక్టర్ పదవులు ఉన్నాయి. ఈ పదవులకు సుడా పరిధిలోని నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పేర్లను సూచించనున్నారు.

**పుష్కర కాలం తరువాత..**

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ దాదాపు 12ఏళ్ల తరువాత కొలువుదీరనుంది. 2012 వరకు భద్రాద్రి ట్రస్ట్ బోర్డ్ సేవలందించింది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ట్రస్ట్ బోర్డ్ ఊసే లేకుండా పోయింది. కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రులు, ముఖ్యనేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా ఆయన అంగీకరించారు. గతంలో ఛైర్మన్‌తో పాటు పదకొండు మంది సభ్యులకు బోర్డులో అవకాశముండేది. ఈసారి సభ్యుల సంఖ్య 20 వరకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆలయాల ట్రస్ట్ బోర్డ్‌లో పదవుల కోసం ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని దేవాదాయశాఖ ఇప్పటికే ప్రకటించింది. ఉభయ జిల్లాలకు చెందిన పలువురు నేతలు భద్రాద్రి ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ పదవిని ఆశిస్తూ దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారంలోగా ఈమేరకు ప్రభుత్వ ప్రకటన వస్తుందని సమాచారం. పలువురు ముఖ్యనేతలు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులను ఆశిస్తున్నారు. ఉభయ జిల్లాల నుంచి తొలిదఫాలో ఐదుగురికి కార్పొరేషన్ పదవులు దక్కాయి. రెండో దఫాలో ఇద్దరు, ముగ్గురు కీలక నేతలకు కార్పొరేషన్ పదవులు వరించే అవకాశముందని తెలిసింది.

# త్వరలోనే గృహయోగం..!

కొత్తగూడెం: నిరుపేద, బడుగు బలహీన వర్గాల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో శరవేగంగా సాగుతోంది. లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. గతంలో 'ప్రజాపాలన' కార్యక్రమం ద్వారా సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు యాప్‌లో నిక్షిప్తమై ఉంటాయి. వీటి ఆధారంగా దరఖాస్తుదారులు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులా? కాదా? అనే అంశాన్ని అధికారులు తేల్చనున్నారు. ఒక్కో సర్వేయర్(పంచాయతీ కార్యదర్శి) 500 మంది దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేసేలా ప్రణాళిక రూపొందించారు. కలెక్టర్ల ఆదేశాల మేరకు ఈ నెలాఖరు నాటికి సర్వే పూర్తి చేయనున్నారు.

**ఇందిరమ్మ కమిటీల సమక్షంలో..**

సర్వే ప్రక్రియను సంబంధిత పంచాయతీ కార్యదర్శితో పాటు స్థానిక ఇందిరమ్మ కమిటీల సమక్షంలో నిర్వహించాలని భద్రాద్రి జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లోని నాలుగో కాలమ్‌లో అర్హులు/అనర్హులు అనే ఐచ్ఛికాన్ని అధికారులు, ఇందిరమ్మ కమిటీలకు కాకుండా తమకు ఇవ్వటం వల్ల ఇబ్బందిగా మారుతోందని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఇటీవల కలెక్టర్ జితేష్ వి.పాటిల్, డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు సర్వేలో సమాచార సేకరణ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సర్వేయర్‌తో పాటు ఇందిరమ్మ కమిటీల సమక్షంలో జరగాలని సదరు అధికారులు సూచించారని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

**భారీగా దరఖాస్తులు..**ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు అందాయి. ఖమ్మం జిల్లాలో 3,57,869, భద్రాద్రి కొత్తగూడెంలో 2,79,638 మంది అర్జీ పెట్టుకున్నారు. వీరిలో అర్హులు ఎవరనేది సర్వేలో తేలనుంది. సర్వే ఆధారంగా మొదటి విడతలో ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేయాలనేది ఇందిరమ్మ కమిటీలు గ్రామసభల ద్వారా నిర్ణయించనున్నాయి. ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు పూర్తి రాయితీతో రూ.5లక్షల చొప్పున సర్కారు మంజూరు చేయనుంది. మొదటి విడతలో ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించనున్నట్లు ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది.

మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు యత్నిస్తున్నారు. ఈమేరకు పాలేరు నియోజకవర్గం కూసుమంచిలో చేపట్టనున్న నమూనా నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. భద్రాద్రి జిల్లాలో నమూనా ఇళ్ల కోసం త్వరితగతిన స్థలం సేకరించాలని భద్రాచలం, కొత్తగూడెం ఆర్డీఓలను కలెక్టర్ ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి. సర్వేలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలి. గ్రామస్థాయిలో ఎక్కువ దరఖాస్తులు ఉన్నచోట సర్వేకు అదనపు సిబ్బందిని కేటాయిస్తాం. ప్రతి దరఖాస్తుదారు వివరాలను యాప్‌లో తప్పకుండా నమోదు చేస్తాం.జితేశ్ వి.పాటిల్, కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం

# ధాన్యం లేని మిల్లులపై విజిలెన్స్ నజర్

సూర్యాపేట : రెండు రోజుల కిందట సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రెండు మిల్లులను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. సీఎంఆర్ ధాన్యం లేకపోవడంతో ఆ మిల్లుల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా మిల్లులపైనా ఆ అధికారులు నజర్ వేసినట్లు తెలుస్తోంది. వారికి యాసంగి, వానాకాలం రెండు సీజన్లు దాటుతున్న ఆయా మిల్లుల యజమానులు సీఎంఆర్ ఇచ్చేందుకు పెద్దగా మొగ్గు చూపడంలేదని ఆరోపణలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం బకాయిదారులపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో ఆయా మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లులను మూడు విభాగాలుగా విభజిస్తూ జీవో 27ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో



113 మిల్లుల్లో ఎలాంటి బకాయి ధాన్యంలేదని అధికారులు తేల్చారు. మిగతా 10 మిల్లులు జరిమానాతో ధాన్యం చెల్లిస్తే, 27 మిల్లులు జరిమానా చెల్లించాల్సి ఉంది. మూడు మిల్లులో నూరు శాతం బకాయి ఉన్నట్లు తేల్చారు. ఇప్పటికే పౌరసరఫరా శాఖాధికారులు బకాయి మిల్లులపై రెవన్యూ రికవరి యాక్ట్‌ను ప్రయోగించారు.

2023-24 యాసంగి సీజన్‌లో కస్టం మిల్లింగ్ కోసం ధాన్యం తీసుకున్న కొన్ని మిల్లుల్లో నిల్వలులేనట్లు తెలుస్తోంది. ఆయా మిల్లులపై తనిఖీ చేసి కేసులు నమోదు చేసే అవకాశాలున్నాయి. ఇప్పలనర్సింగాపూర్(హుజూరాబాద్), కనగర్తి(వీణవంక), దుర్శేడ్‌లోని రెండు(కరీంనగర్ రూరల్), మొలంగూర్(శంకరపట్నం), కరీంపేట, శంకరపట్నం, రేణికుంటతోపాటు మొత్తం 12 మిల్లుల్లో ధాన్యం లేవని తెలుస్తోంది. సూర్యాపేట జిల్లాలో విజిలెన్స్ అధికారులు మిల్లులను తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్న తరహాలో జిల్లాలోనూ తనిఖీ చేసి కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఉపాధిలో అతివలదే అగ్రస్థానం

ఆలేరు : ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని మహిళలు ఓ వైపు తమ ఇంటిని చక్కబెడుతూనే కుటుంబ పోషణకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తున్నారు. పురుషులతో సమానంగా ఉద్యోగాల్లోనే కాకుండా వ్యవసాయ, కూలీ పనుల్లో చెమటోడుస్తున్నారు. ఉపాధి హామీ పనులకు హాజరైన మొత్తం కూలీల్లో 57శాతం మహిళలే ఉండటం విశేషం. మూడు జిల్లాల్లోనూ పురుషుల కన్నా అతివలే అధికంగా పనిదినాలు ఉపయోగించుకోవడం గమనార్హం.

**చేదోడుగా నిలుస్తూ**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7,65,128 జాబ్‌కార్డులుండగా 15,98,634 మంది కూలీలు ఉన్నారు. ఇందులో అత్యధికంగా నల్గొండ జిల్లాలో, అత్యల్పంగా యాదాద్రి జిల్లాలో జాబ్‌కార్డులున్నాయి. ఇప్పటి వరకు 3,82,972 మంది పురుషులు, 5,03,120 మంది మహిళా కూలీలు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగ పరచుకున్నారు. అంటే 1,20,148 మంది మహిళా కూలీలు పురుషులకంటే అదనంగా ఉపాధి పొందినట్లుగా తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు నల్గొండ జిల్లాలో 46,762 మంది మహిళలు, సూర్యాపేటలో 24,590 మంది, యాదాద్రి జిల్లాలో 48,796 మంది మహిళా కూలీలు పథకాన్ని సద్వినియోగ పరచుకున్నారు.

ఆ కుటుంబాల్లో వంద రోజులు పూర్తి

ఉమ్మడి జిల్లాలో గతేడాది 2,378 కుటుంబాలు వంద పనిదినాలను పూర్తి చేసుకోగా ఈ ఏడాది 1,514 కుటుంబాలు పూర్తిచేసుకున్నాయి. అందులో అత్యధికంగా నల్గొండ జిల్లా నుంచి 628, సూర్యాపేట 378, యాదాద్రిలో 308 కుటుంబాలు ఉండటం విశేషం.

అదనపు ప్రయోజనాలు : నాగిరెడ్డి, డీఆర్డీవో, యాదాద్రి భువనగిరి జిల్లావంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల యువతీ యువకులకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇస్తున్న 'ఉన్నతి' శిక్షణ ద్వారా అదనపు ఉపాధి లభిస్తోంది. గడిచిన కొంత కాలంగా ఉపాధిహామీ పథకం పనుల్లో పురుషులకంటే మహిళామణులే ఎక్కువగా సద్వినియోగ పరచుకుంటుండటం మంచి పరిణామం.

# గుట్టరట్టుగా మట్టి దందా..!

మధిర : మధిర మండల పరిధిలోని ఎండపల్లి గుట్ట నుంచి యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా సాగుతోంది. నాగ్‌పూర్- అమరావతి జాతీయ రహదారి నిర్మాణానికి మట్టి తోలకం అనుమతులను అడ్డం పెట్టుకొని అక్రమార్కులు రూ.కోట్ల దందా చేస్తున్నారు. పగలూరాత్రీ తేడా లేకుండా మట్టిని లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నాగ్‌పూర్- అమరావతి జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం మట్టిని తరలిస్తున్నారని అధికారులు చెబుతుండటం గమనార్హం. మట్టి అక్రమ రవాణా వల్ల ఎండపల్లి ప్రాంతంలోని కొండలు ఇప్పటికే



# కాలుష్యం దూరం... నగరం సుందరం



హైదరాబాద్ : కాలుష్య రహిత రాజధానిగా హైదరాబాద్‌ను మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను రూపొందించింది. డీజిల్ బస్సులు, ఆటోలు, పరిశ్రమలను తరలించడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తోంది. రాజధాని చుట్టుపక్కల తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలను అక్కడి నుంచి తరలించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన కార్యాచరణను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

దిల్లీ కాకుండా..: ఇప్పటికే మహానగరంలో కొన్ని ప్రాంతాల్లో కాలుష్యం తీవ్ర రూపం దాలుస్తోంది. పరిస్థితిని ఇలా చూసీ చూడనట్లు వదిలేస్తే దిల్లీ మహానగరంలాగే భవిష్యత్తులో ఇబ్బంది పడాల్సి వస్తుందని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఈనేపథ్యంలోనే కాలుష్యకారక వ్యవస్థపై దృష్టి సారించారు. ః టీజీఎస్‌ఆర్టీసీ నగరం పరిధిలో 2800 బస్సులుంటే అందులో దాదాపు 75 శాతం బస్సులు డొక్కు బస్సులే. నిబంధన ప్రకారం ఏ బస్సైనా పదిహేనేళ్లకు మించి తిరగకూడదు. పన్నెండు లక్షల కిలో మీటర్లకు మించి రోడ్ల మీద పరుగులు పెట్టకూడదు. ఈ రెండింటిని ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. అందుకే నగరంలో కాలుష్యం పెరుగుతోంది.

**ఆటోలపై దృష్టి:** నగరంలో దాదాపు లక్ష వరకు ఆటోలున్నాయి. చాలావరకు పాతవే ఉండటంతో తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. వీటి స్థానంలో సరికొత్త పథకాన్ని తేవాలని యోచిస్తున్నారు. మహిళలకు కొంత ఆర్థికతోడ్పాటుతో విద్యుత్తు ఆటోను కొనుగోలు చేసి ఇవ్వాలని ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

**పరిశ్రమల తరలింపు సాధ్యమేనా..?:** కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలు వెయ్యి వరకు ఉంటాయి. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో 300లకుపైగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నట్లు గుర్తించారు. వీటిని సంగారెడ్డికి తరలించాలనుకుంటున్నారు.

కాటేదాన్‌తోపాటు మిగిలిన అనేక ప్రాంతాల్లో కూడా ఇలానే కాలుష్య కారక పరిశ్రమలున్నాయి.

**ఐఐటీ అధ్యయనం** ఈ ఏడాది నగరంలో కాలుష్యం పెరుగుతోంది. పీఎం 2.5 ఉద్గారాల్లో 20శాతానికి పైగా రోడ్లపై లేచే దుమ్మే కారణం. 2018లో పీఎ 2.5 ఉద్గారాలు 34వేల టన్నులు ఉండగా...2030 నాటికి 40వేలకు చేరుకుంటుందని 'అర్బన్ ఎమిషన్స్ గ్రూపు' తన అధ్యయనంలో వెల్లడించింది. సోర్స్ ఆఫ్ అపాయింట్‌మెంట్ అండ్ క్యారియింగ్ కెపాసిటీ హైదరాబాద్ అంశంపై అధ్యయనం చేసిన ఐఐటీ కాన్పూర్ బృందం కూడా ధ్రువీకరించింది. సాధారణంగా పీఎం 2.5 తీవ్రత ఘనపు మీటరు గాలిలో 40 మైక్రోగ్రాములకు మించొద్దు. తాజా గణాంకాల ప్రకారం 46 మైక్రోగ్రాములుగా నమోదవుతోంది.

# మాటలు బురిడీ.. కొలువుల గారడీ!



హైదరాబాద్: కరీంనగర్‌కు చెందిన యువకుడు ఎంబీఏ పూర్తిచేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు. దుబాయ్‌లో ఉద్యోగ అవకాశాలు.. నెలకు రూ.రెండున్నర లక్షల జీతం అంటూ అమీర్‌పేట్‌లోని కన్సల్టెన్సీ ఇచ్చిన ప్రకటనకు ఆకర్షితుడై రూ.4.5 లక్షలు చెల్లించాడు. ఏడాది దాటినా కొలువు లభించకపోగా పొలం తాకట్టుపెట్టి తెచ్చిన రుణానికి వడ్డీలు కట్టలేక ఆందోళనకు గురయ్యాడు. పోలీసుల వద్దకు వెళ్తే అసలు సొమ్ము రాదనే ఉద్దేశంతో ఒక ప్రజాప్రతినిధిని ఆశ్రయించాడు. ఎల్బీనగర్‌కు చెందిన యువతికి సింగపూర్‌లో నర్సు ఉద్యోగం ఇప్పిస్తామంటూ మరో కన్సల్టెన్సీ రూ.2 లక్షలు కొట్టేసి ముఖం చాటేసింది. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన ఎంతో మంది యువతీయువకులు ఉపాధి, ఉద్యోగ అవకాశాల బాటలో మోసగాళ్ల మాటలకు తలొగ్గుతున్నారు. తమతో పాటు చదివిన వారంతా ఉద్యోగాల్లో స్థిరపడడం, కుటుంబసభ్యులు, బంధువుల నుంచి ఖాళీగానే ఉన్నారా.. అంటూ ఎదురయ్యే ప్రశ్నలకు జవాబు చెప్పలేక మాయగాళ్ల వలకు చిక్కుతున్నారు. నకిలీ కన్సల్టెన్సీల చేతిలో సమయం, డబ్బు నష్టపోతున్నారు.


**మోసాలు ఏటా రెట్టింపు**

గతేడాది నగరంలో ఎంప్లాయిమెంట్ స్కామ్స్/జాబ్‌రాకెట్‌పై 26 కేసులు నమోదయ్యాయి. 204 మంది బాధితులు సుమారు రూ.21 కోట్లు నష్టపోయారు. మోసాలకు పాల్పడిన 58 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఏడాది బాధితుల సంఖ్య రెట్టింపు కావచ్చని పోలీసుల అంచనా. గ్రేటర్ పరిధిలో 30కి పైగా నకిలీ కన్సల్టెన్సీలు నడుస్తున్నట్లు నగరానికి చెందిన పోలీసు అధికారి తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో వీటిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు వివరించారు.

**ఊరించి.. సొమ్ములు కొట్టేసి**

గ్రేటర్ పరిధిలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు, వీసా సౌకర్యం కల్పిస్తామంటూ వందలాది ప్రైవేటు కన్సల్టెన్సీ సంస్థలు వెలిశాయి. వీటిలో కొన్ని నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తుండగా అధిక శాతం కన్సల్టెన్సీలు పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తూ మోసగిస్తున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. తాజాగా హిమాయత్‌నగర్‌కు చెందిన జేజేరెడ్డి కన్సల్టెన్సీ 100 మందిని మోసగించినట్లు బయట పడింది. విద్యా సంస్థలు, శిక్షణ కేంద్రాలున్న ప్రాంతాల్లో ప్రారంభిస్తున్న కన్సల్టెన్సీలు సామాజిక మాధ్యమాలు, ఏజెంట్ల ద్వారా విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న వారిని ఆకట్టుకుంటున్నాయి. మరికొన్ని సంస్థల నిర్వాహకులు ఉద్యోగాల అన్వేషణలో ఉన్న యువతీ, యువకుల వివరాలు సేకరించి వారి ఈ మెయిల్, ఫోన్ నంబర్లకు దేశ, విదేశాల్లోని ప్రముఖ కంపెనీల్లో విద్యార్హతకు తగినట్లుగా ఉద్యోగం కల్పిస్తామంటూ సమాచారం పంపుతున్నారు. 3 నెలల వ్యవధిలోనే ఖర్చు చేసిన సొమ్ము తిరిగి సంపాదించుకోవచ్చని తీయటి కబుర్లతో యువతను బురిడీ కొట్టిస్తున్నారు.

# దక్షిణ ఇస్తే సరే..!



హైదరాబాద్ : ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న కొందరు రైతులు.. రెవెన్యూ అధికారులు చేసిన తప్పులతో మరిన్ని కష్టాలు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు రికార్డులను కంప్యూటరీకరించేప్పుడు ప్రైవేటు పట్టాభూములను భూదాన్ భూములుగా నమోదు చేశారు. మెయినాబాద్ మండలం కనకమామిడిలో ఈ వ్యవహారం కొన్నేళ్ల క్రితం జరిగింది. పట్టాభూములున్న రైతుల్లో కొందరు వాటిని విక్రయించేందుకు ప్రయత్నించగా... రికార్డుల్లో భూదాన్ భూములుగా ఉన్నాయని.. విక్రయించేందుకు వీల్లేదని రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు చెప్పడంతో హతాశులయ్యారు. పరిష్కార మార్గాలకు ప్రయత్నిస్తుండగా.. ఒకరిద్దరు అధికారులకు దక్షిణ ఇస్తే పని పూర్తవుతుందని చెప్పడంతో రూ.లక్షల్లో సమర్పించుకొని ప్రైవేటు పట్టాలుగా మార్చుకున్నారు. డబ్బు ఇచ్చేందుకు శక్తిలేని వారు మాత్రం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

**గ్రామ రెవెన్యూ అధికారి నిర్వాకంతో...**

మెయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో వందల ఎకరాల్లో రైతుల భూములున్నాయి. వాటిని వారసత్వంగా సాగు చేసుకుంటున్నారు. ఏడేళ్ల క్రితం అక్కడ గ్రామ రెవెన్యూ అధికారిగా రికార్డులను సక్రమంగా చూసుకోకపోవడం, కంప్యూటరీకరించేటప్పుడు పట్టాదార్ పాసుపుస్తకాలను సరిగా పోల్చుకోకపోవడంతో సుమారు 17 ఎకరాల పట్టాభూములను భూదాన్ రికార్డుల్లో నమోదు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో భూదాన్ భూములుగా ఉండడంతో భూదాన్ బోర్డు అధికారులు తమవేనంటూ తీసుకున్నారు. పహణీ రికార్డుల్లో రైతుల పేరిట పట్టాదార్ పాసుపుస్తకాలున్నా... ధరణి పోర్టల్‌లో తప్పుగా నిషేధిత భూములుగా నమోదు చేశారు. కరోనా ప్రభావంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న రైతులు విక్రయించేందుకు ప్రయత్నించగా.. విషయం వెలుగులోకి వచ్చింది.

**డబ్బు ఇచ్చాక రికార్డుల్లో మార్పులు...**

తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్ కార్యాలయం చుట్టూ బాధితులు తిరుగుతుండగా రెండేళ్ల క్రితం రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహించే ఓ అధికారి రూ.లక్షల్లో ముడుపులిస్తే రికార్డుల్లో మార్చేస్తారంటూ చెప్పారు. తొలుత నమ్మలేకపోయినా.. పొలం అమ్మితే డబ్బులొస్తాయన్న భావనతో కొందరు రైతులు ఆ అధికారి చెప్పిన మాటలు నమ్మారు. రూ.లక్షల్లో దక్షిణ సమర్పించుకున్నారు. రెవెన్యూ అధికారులు సవరణలు రాసి వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. పట్టా భూములను భూదాన్ భూములుగా ఓ అధికారి మార్చిన విషయంపై మెయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను వివరణ కోరగా.. రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

# ఏళ్ల తరబడి అదే తీరు

పెద్దపల్లి : మిల్లులకు ధాన్యం కేటాయింపులు.. ప్రభుత్వానికి బియ్యం బకాయిలు.. సీఎంఆర్ అప్పగించేందుకు మిల్లర్లకు గడువు పొడిగింపు.. లక్ష్య సాధనపై అధికారుల సమీక్షలు.. ఇదీ ఏటా జరుగుతున్న తతంగం.. ప్రతి సీజన్‌లో మిల్లర్లకు నిర్దేశించిన లెవీ కోటా అలాగే ఉండిపోతూ ఏళ్ల తరబడి పాత బకాయిలు పేరుకుపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అత్యంత వివాదాస్పదంగా మారిన 2018 ధాన్యం బకాయిలు పూర్తి చేయడానికి ప్రభుత్వం ఏటికేడు గడువు పొడిగిస్తూనే ఉంది. ఈ కోటాను పూర్తి చేయడానికి మరోసారి వచ్చే జనవరి 20 వరకు గడువు విధించారు. ఇవే కాకుండా 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి రెండు సీజన్‌లకు చెందిన సీఎంఆర్ కోటా ఇప్పటికీ పూర్తి కాలేదు.

**వెంటాడుతున్న రెండేళ్ల నాటి బకాయిలు**

తాము బకాయి పడిన ధాన్యాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తుందనే ప్రచారంతో జిల్లాలోని పలువురు మిల్లరు బియ్యం అప్పగించకుండా ఉండిపోతున్నారు. 2022-23లో వేలం ద్వారా ధాన్యం దక్కించుకున్న గుత్తేదారులు మిల్లర్ల నుంచే సేకరించాల్సి ఉండటం సమస్యగా మారింది. మిల్లర్లు లెవీ కోటా పూర్తి చేయకుండా తమ వద్ద ఉంచుకున్న ధాన్యం కోసమే ప్రభుత్వం వేలం నిర్వహించింది. 2023-24 యాసంగి కోటాలో 69 శాతాన్ని మిల్లర్లు పూర్తి చేశారు. ఈ కోటా పూర్తి చేయడానికి ప్రస్తుతానికి సమయమున్నా 2022-23 యాసంగి బకాయిలు మిల్లర్లను వెంటాడుతున్నాయి.




**బాధ్యులపై చర్యలకు మీనమేషాలు**

లెవీ కోటా భర్తీలో నిర్లక్ష్యం వహించిన మిల్లర్లపై చర్యలకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో ఏటికేడు బకాయిలు పెరిగిపోతున్నాయి. 2018-19లో కేటాయించిన ధాన్యాన్ని అమ్ముకున్న 42 మంది మిల్లర్లను గుర్తించిన అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారు. అందులో కొందరు డబ్బులు చెల్లించడంతో నిషేధం ఎత్తివేశారు. 2019-20, 2020-21 కరోనా సీజన్, 2021-22లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం ముదిరి లెవీ బియ్యం తీసుకోవడంలో జాప్యం జరిగింది. అప్పటి నుంచి తమ వద్ద పేరుకుపోయిన ధాన్యం అమ్ముకున్న మిల్లర్లపై కనీస చర్యలు లేకపోవడంతోనే ఏటా బకాయిల వసూళ్ల కోసం ప్రభుత్వం సమీక్షలు నిర్వహించడం పరిపాటిగా మారింది.

**కేటాయింపుల్లో వివక్ష**

తమకు కేటాయించిన ధాన్యంలో వంద శాతం లెవీ కోటాను పూర్తి చేసిన మిల్లర్లు జిల్లాలో అతి స్వల్పంగా ఉన్నారు.


ప్రతి సీజన్‌లో ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మరాడించి బియ్యం ఇవ్వడానికి మరుసటి ఏడాది సీజన్ ప్రారంభం వరకు మిల్లర్లకు సమయం ఉంటుంది. గడిచిన వానాకాలం(2022-23)లో జిల్లాలో 96 శాతం సీఎంఆర్ కోటా పూర్తయింది. ఇదే స్థాయిలో 2023-24 వానాకాలానికి కేటాయింపులు జరగాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా జిల్లాలోని 55 శాతం మిల్లులకే కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2022-23 యాసంగి కోటా పూర్తి చేయడానికి ఈ నెలాఖరు వరకు గడువుంది. ఆ సీజన్‌కు సంబంధించి బకాయి పడిన ధాన్యానికి ప్రభుత్వం బహిరంగ వేలం నిర్వహించడంతో బియ్యం కోటా పూర్తి చేయాల్సిన బాధ్యత మిల్లర్లపై లేకుండా పోయింది. బియ్యం అప్పగింతకు వేలంలో దక్కించుకున్న సంస్థలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో 216 మిల్లులుంటే కేవలం 120 మిల్లులకే ప్రస్తుత సీజన్‌లో కేటాయించడం వివాదాస్పదమైంది. ఇందులో రారైస్(పొడి బియ్యం) మిల్లులు 16 మాత్రమే కావడం గమనార్హం.

# తుది దశలో కుటుంబ సర్వే

## వైద్య పరీక్షలతోనే మహమ్మారి కట్టడి

గోదావరిఖని : క్యాన్సర్ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రజల్లో అవగాహన పెరుగుతుండటంతో ముందస్తుగానే లక్షణాలను గుర్తించి చికిత్స పొందుతూ త్వరితగతిన క్యాన్సర్‌ను జయిస్తూ మెరుగైన జీవనయానం సాగిస్తున్నారు. 'ముందస్తుగా గుర్తించడం... అవగాహన పెంచుకోవడం, క్యాన్సర్‌తో కలిసి పోరాడుదాం...' నినాదాలతో ప్రపంచ ఆరోగ్య సంస్థ అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం వల్లే చాలామంది వ్యాధి బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ సంస్థ గణాంకాల ప్రకారం 2020లో దేశంలో 19.3 మిలియన్ క్యాన్సర్ కేసుల నమోదుతో భారతదేశం ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచింది. 2040 నాటికల్లా 57.5 శాతం కేసులు పెరిగే అవకాశముందని సూచించారు. ఈ మేరకు ఎక్కడికక్కడ క్యాన్సర్ వ్యాధిని అరికట్టాలంటే ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నిరంతరంగా వైద్య పరీక్షలు చేయించుకోవడమే మార్గమని భావించిన ప్రభుత్వం ఇంటింటా అవగాహనకు చర్యలు తీసుకుంటోంది.

**ఇదీ నేపథ్యం** 2014లో అప్పటి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ఏటా కార్యక్రమాలు చేపడుతున్నారు. నోబెల్ బహుమతి గ్రహీత మేడమ్ క్యూరీ రేడియం, ఫోలోనియంలను కనుగొనడంతో క్యాన్సర్‌పై పోరాటంలో భారీ



మార్పులు చోటుచేసుకున్నాయి. అందుకే మేడమ్ క్యూరీ జన్మదినమైన నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంగా కేంద్రం ప్రకటించింది.

**రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు**

క్యాన్సర్ నివారణలో అవగాహనదే కీలకపాత్రగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎన్.సి.డి. (నాన్ కమ్యూనల్ డిసీజెస్)పై వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించడంతో పాటు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని ఆసుపత్రులు, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది నిరంతరంగా ఇంటింటా అవగాహన చేపడుతున్నారు. అనుమానిత కేసులకు సంబంధించి సంపూర్ణ వైద్య పరీక్షలు చేశాకే నిర్ధారణకు వస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ, ఊపిరితిత్తులు, ప్రొస్టేట్, సర్వేకల్, నోటి క్యాన్సర్ కేసులు ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లినిక్‌లోనూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, అవగాహనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

**కారకాలివే...**

శరీరంలోని కణాలు అదుపు లేకుండా పెరిగి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించడంతో క్యాన్సర్ సోకుతుంది. అతినీలలోహిత కిరణాలు, పొగాకు ఉత్పత్తులను తినడం, అతిగా మద్యం తాగడం, ఆహార, నీటి కాలుష్యం, బ్యాక్టీరియా, ఫంగస్ తదితర క్రిముల వల్ల క్యాన్సర్ వ్యాపిస్తుంది. పెద్దపల్లి జిల్లాలో వివిధ రకాల క్యాన్సర్ బారిన పడిన 271 మంది చికిత్స పొందుతున్నారు. పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువ. మెనోపాజ్ దశలో మహిళలకు క్యాన్సర్ సోకే అవకాశముంటుంది. దీని బారిన పడ్డవారు అలసటగా ఉండడం, గడ్డలు, చర్మం కింద గట్టిగా అనిపించడం, చర్మం పసుపు, ఎరుపు, నలుపు రంగులోకి మారడం, నయం కాని పుండ్లు, మలవిసర్జన సమయంలో ఇబ్బందులు, నిరంతర దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నోరు బొంగురు పోవడం, అజీర్తి, కండరాలు, కీళ్ల నొప్పులు, రాత్రి పూట చెమటలు పట్టడం, తీవ్రమైన జ్వరం తదితర లక్షణాలుంటాయి. ఈ లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించి అవసరమైన నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

**నివారణపై ప్రత్యేక దృష్టి**

డాక్టర్ అన్నప్రసన్నకుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, పెద్దపల్లి క్యాన్సర్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా, సార్వజనిక, సామాజిక ఆసుపత్రుల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నాం. లక్షణాలు కనిపిస్తే నమూనాలు సేకరిస్తున్నాం. నివేదికల ఆధారంగా స్థానికంగా వారికి వైద్య సేవలు అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

## ఇక స్టాంపింగ్ తప్పనిసరి

కరీంనగర్: భవన నిర్మాణాల స్లాబ్‌లు, రహదారి నిర్మాణాలకు సంబంధించి ఇసుక, సిమెంటు, కంకర, నీళ్ల తదితరాలను సమపాళ్లలో రెడీమిక్స్ ప్లాంట్‌లలో కలియబెట్టి అవసరమైన చోటుకు వాహనాల్లో తరలిస్తారు. ఇలాంటి ప్లాంట్లకు కూడా ఇక తూనికలు, కొలతల శాఖ నుంచి తప్పనిసరిగా స్టాంపింగ్ (ముద్ర) వేయించుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్లాంట్ల నిర్వాహకులకు అధికారులు నోటీసులు పంపుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో..** ఉమ్మడి జిల్లాలో సుమారు 35 వరకు రెడీమిక్స్ ప్లాంట్లు ఉన్నాయి. కరీంనగర్‌లో దాదాపు 15 వరకు ఉంటాయి. యజమానులు ప్లాంట్లలో ఇసుక, కంకర, సిమెంటు, నీటిని సమపాళ్లలో పోస్తున్నారో లేదో అధికారులు పరిశీలిస్తారు. అన్ని సక్రమంగా ఉంటే ఆ ప్లాంటుకు ముద్ర (స్టాంపింగ్, ధ్రువీకరణ పత్రం) వేస్తారు. కరీంనగర్ జిల్లాలో ఏ ఒక్క ప్లాంటుకు కూడా స్టాంపింగ్ జరగలేదని అధికారులు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మాత్రం కొన్నింటికి స్టాంపింగ్ జరిగినట్లు సమాచారం.

**నోటీసులు జారీ..**

రెడీమిక్స్ ప్లాంట్లకు సంబంధించి ఫిర్యాదులు వస్తుండటంతో అధికారులు ఆయా ప్లాంట్ల యజమానులు నోటీసులు జారీ చేస్తున్నారు. నెల రోజుల్లో స్టాంపింగ్ చేయించుకోవాలని గడువు విధిస్తున్నట్లు తెలిసింది. ప్రతీ యజమాని తమ ప్లాంటుకు తప్పనిసరిగా స్టాంపింగ్ చేసుకోవాలని సహాయ నియంత్రణాధికారి విజయసారథి స్పష్టం చేశారు. సంబంధిత ధ్రువపత్రం గడువు ఏడాది వరకు ఉంటుందని తెలిపారు. స్టాంపింగ్ చేసుకోకపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పర్యవేక్షణ మరచి.. నిఘానేత్రం మసకబారి



సికింద్రాబాద్ : ప్రపంచంలో ఏ మూల ఉగ్రదాడి జరిగినా.. ఏ దేశంలోనైనా నేరం జరిగినా చాలా సందర్భాల్లో నగరానికి సంబంధం ఉంటోంది. ఉగ్రమూకల ఆచూకీ కనిపెట్టాలన్నా.. అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టించాలన్నా.. శాంతిభద్రతలు సజావుగా ఉండాలన్నా సీసీ కెమెరాలే ఆధారం. పోలీసుల పరిశోధనకు ఆయువుపట్టు లాంటి వాటిపై నిర్లక్ష్యం అలుముకుంది.

**హైదరాబాద్‌లో..:** ఇటీవల అంబర్‌పేట పరిధిలో జరిగిన జంట హత్యల కేసులో నిందితులెవరనేది తెలియలేదు ఘటన జరిగి 15 రోజులు గడుస్తున్నా చిన్న ఆధారం లభించలేదు. సీసీ టీవీ పరిశీలిస్తే అవి పనిచేయలేదు.

సైబరాబాద్ పరిధిలో నేరాలు ఎక్కువగా జరిగే కుత్బుల్లాపూర్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్. ఆ పరిధిలో సగానికి పైగా సీసీ టీవీ కెమెరాలు పనిచేయట్లేదు. పదుల సంఖ్యలో చోరీ కేసుల్లో వేలిముద్రలు దొరకలేదు. అక్కడి కెమెరాల పనితీరు నామమాత్రంగా ఉంటోంది.

రాచకొండ పరిధిలోని ఉప్పల్–తార్నాక ప్రధానమార్గంలో గుర్తుతెలియని వాహనం ఒక వ్యక్తిని ఢీకొట్టి వెళ్లిపోయింది. పోలీసులు రంగంలోకి దిగి దాదాపు 250 సీసీ టీవీ కెమెరాలు పరిశీలించారు. అప్పటికీ కానీ అసలు విషయం గుర్తించలేకపోయారు.. వాటిలో 50 మరమ్మతులకు గురైనట్టు గుర్తించారు.

**రక్షణ ఇలాగేనా:** దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది పర్యాటకులు నగరానికి వేలల్లో వచ్చిపోతుంటారు. ప్రయాణికులతో రద్దీగా ఉండే రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు. చార్మినార్, గోల్కొండ, ట్యాంక్‌బండ్, జంతుప్రదర్శనశాల వంటి పర్యాటక ప్రాంతాల్లో సగానికి పైగా సీసీ టీవీ కెమెరాలు పనిచేయట్లేదు.

**కీలక ప్రాంతంలో..:** బేగంబజార్, మోండామార్కెట్, షాహినాయత్‌గంజ్, మలక్‌పేట్, మెహదీపట్నం, అమీర్‌పేట్ వంటి మార్కెట్ ప్రాంతాల్లో నిఘానేత్రాలు నామమాత్రమే.

**ప్రయాణికుల భద్రతేదీ..?:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 84 సీసీటీవీ కెమెరాలున్నా రికార్డింగ్‌లో నాణ్యత లేదు. నిల్వ సామర్థ్యం మచ్చుకైనా కనిపించదు. రైల్వేస్టేషన్ చుట్టుపక్కల గోపాలపురం, మోండామార్కెట్‌ల్లో 300 కెమెరాల్లో 80 మొరాయించాయి.

**ఇంత దారుణమా:** ప్రధాన ఆసుపత్రులు నిమ్స్, గాంధీ, నిలోఫర్, ఉస్మానియా వంటిచోట్ల పరిస్థితి మరీ దారుణం.. కేవలం 10శాతం మాత్రమే పనిచేస్తున్నాయి.

గాంధీఆసుపత్రి, గాంధీనగర్ పరిధిలో 232లో 156 ఉన్నా లేనట్లే. ఒక్కటీ సరిగా లేవు. చిలకలగూడ ఠాణా పరిధిలో 6874 కెమెరాల్లో 3వేలు పనిచేయడం లేదు.

ఎవరూ వస్తున్నారో...!: మెహిదీపట్నం ప్రధాన రహదారి పీవీ ఎక్స్‌ప్రెస్ పిల్లర్ నంబరు 16, ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ 28 వద్ద కూడా సీసీ కెమెరాలు కొన్ని నెలలుగా మొరాయిస్తున్నాయి. ఎన్ఎండీసీ, మాసాబ్‌ట్యాంక్ చౌరస్తాలతో పాటు మెహిదీపట్నం రైతుబజార్ బస్‌స్టాపులో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గుడిమల్కాపూర్ వివేకానంద చౌరస్తా, సౌత్‌వెస్ట్‌లో 'నేను సైతం'లో 198 సీసీ కెమెరాలున్నా సగమే ఉపయోగపడుతున్నాయి.

**నగరం నలుదిక్కులా.. ఇంతే**

అల్వాల్‌లో 8వేల కెమెరాల్లో 20శాతం (బొల్లారం– బృందావన్ కాలనీ కూడలి) పనిచేయక 6 నెలల దాటింది.

బాలానగర్ ఠాణా పరిధిలో బాలానగర్ ప్రధాన రహదారి, ఐడీపీఎల్, గుడెన్‌మెట్, ఫిరోజ్‌గూడ, ఐడీఎల్‌రోడ్, ఉషాముళ్లపూడి మార్గాల్లో 70శాతం పనిచేయడం లేదు. : సైబరాబాద్‌లో కీలకమైన కూకట్‌పల్లి ఠాణా పరిధిలో 2,380 కెమెరాల్లో 2150, కేపీహెచ్‌బీ కాలనీలో 1000లో 600 మాత్రమే పనిచేస్తున్నాయి. ఇక్కడి 50 కాలనీల్లో 10 కాలనీల్లో మాత్రమే నిఘా నేత్రాల జాడ కనిపిస్తుంది.

ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలతో ఏర్పాటు చేసిన సీటీ టీవీ కెమెరాల్లో 60శాతం మూలనపడ్డాయి. ప్రైవేటు వసతి గృహాలున్న లక్ష్మారెడ్డి కాలనీలో సుమారు 40 సీసీ కెమెరాల్లో 90శాతం పని చేయడం లేదు. చిలుకానగర్ డివిజన్‌లో పనితీరు అంతంతమాత్రమే.

నార్సింగి ఠాణా పరిధిలో కమ్యూనిటీలో 1018, నేను సైతంలో 10,723 కెమెరాలు ఏర్పాటు చేశారు. 369 అక్కరకు రావడం లేదు. రాయదుర్గం ఐటీ కారిడార్ పరిధిలో 800 సీసీ టీవీ కెమెరాల్లో మణికొండ, పంచవటీకాలనీ, గచ్చిబౌలి, అంజయ్యనగర్, ల్యాంకోహిల్స్ ఖాజాగూడల్లో కీలకమైనచోట్ల 80శాతం మొరాయించాయి.

## చెప్పిందొకటి.. చేసేదొకటి



హైదరాబాద్ :గత సర్కారు పేద, మధ్య తరగతి ప్రజలకు కల్పించిన ఆస్తిపన్ను రాయితీ పథకాన్ని జీహెచ్ఎంసీ రద్దు చేసింది. పన్ను సవరణ పేరుతో.. లబ్ధిదారుల మెడపై కత్తి పెడుతోంది. మీకు రూ.101 ఆస్తిపన్ను పథకం వర్తించదని, ఇకపై పూర్తిస్థాయిలో పన్ను చెల్లించాలంటోంది. మరీ దారుణంగా.. గడిచిన రెండున్నరేళ్ల కాలానికి పెంచిన పన్ను మొత్తాన్ని చెల్లించాలని నోటీసులిస్తోంది. కొందరు సర్కిళ్ల ఉప కమిషనర్లు, సహాయ మున్సిపల్ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్ల చేతివాటంలోనే నోటీసుల పరంపర కొనసాగుతోందనే విమర్శలొస్తున్నాయి.

**పథకానికి పాతర**

ఆస్తిపన్ను రూ.1200ల లోపు ఉన్న నిర్మాణాలకు 2017లో ప్రభుత్వం పన్ను రాయితీ ఇచ్చింది. ఆ పరిధిలోని యజమానులంతా ఏడాదికి రూ.101 పన్ను చెల్లిస్తే సరిపోతుందని అప్పటి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆమేరకు జీహెచ్ఎంసీ పథకాన్ని అమలు చేసింది. తద్వారా.. జీహెచ్ఎంసీకి రూ.100 కోట్ల వార్షిక ఆదాయానికి గండి పడింది. లోటును భర్తీ చేసుకునేందుకు.. జీహెచ్ఎంసీ ఏడాది తర్వాత సునామీ సర్వే చేపట్టింది. వాస్తవ విస్తీర్ణాన్ని తక్కువ చూపించి, రూ.101 పథకాన్ని అనుభవిస్తోన్న వేలాది నిర్మాణాలను గుర్తించి పన్ను సవరించడంతో లోటు భర్తీ అయింది.

ఈ ఏడాది జూన్‌లో ఆస్తిపన్నుకు సంబంధించి.. వాణిజ్య కేటగిరీలో విద్యుత్తు కనెక్షన్లు ఉన్న నిర్మాణాలు, 'సున్నా' విస్తీర్ణం కింద పన్ను చెల్లించే భవనాలు, ఆస్తిపన్ను సున్నా రూపాయలుగా ఉండే నిర్మాణాలు, రూ.101 పన్ను పథకాన్ని పొందుతోన్న వ్యాపార కేంద్రాలకు మాత్రమే నోటీసులిచ్చి పన్ను వాస్తవీకరించాలని కేంద్ర కార్యాలయం ఆదేశించింది. అయితే సర్కిళ్ల అధికారులు వీటితోపాటు రూ.101 పన్ను పథకానికి అర్హత ఉన్న ఇళ్లకు కూడా నోటీసులివ్వడంతో నివాసితులు తీవ్రఆందోళన చెందుతున్నారు.

కూకట్‌పల్లి అధికారులను వివరణ కోరగా.. "కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో ఆస్తిపన్ను సర్వే జరుగుతోంది. కూకట్‌పల్లి సర్కిల్‌లో 676, మూసాపేట సర్కిల్‌లో 595ఇళ్లను పరిశీలించాం. పెరిగిన పన్ను విలువతో డిమాండ్ నోటీసులు ఇచ్చాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికే కాకుండా.. గత రెండున్నరేళ్లకు కూడా పన్ను వసూలు చేసే అధికారం జీహెచ్ఎంసీకి ఉంది" అని తెలిపారు.

## కల్లం.. రైతన్న కల్లోలం

తాండూరు : 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' కింద జిల్లాలో నిర్మించ తలపెట్టిన పంట కల్లాల నిర్మాణం నిర్ణీత లక్ష్యం చేరుకోలేదు. దీంతో రైతులు రహదారులు, ఖాళీ స్థలాలు తదితరాలపై ఆధారపడాల్సి వస్తోంది. కొన్నిచోట్ల ప్రభుత్వ ఆర్థిక సాయంతో రైతులు స్వయంగా నిర్మించుకున్న వాటిని జాగ్రత్తగా కాపాడుకోవడంతో నేటికీ వారికి ఉపయోగపడుతున్నాయి. కాకపోతే ఇలాంటివి పదుల సంఖ్యలో కూడా లేకపోవడం గమనార్హం.

**జాబ్ కార్డు నిబంధన అవరోధం**

కేంద్ర ప్రభుత్వం 2019–2020లో జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ జాబ్ కార్డులున్న రైతులు కల్లాలు నిర్మించుకునేలా నిబంధన విధించింది. ఒక్కో కల్లం నిర్మాణానికి సామగ్రి తరలించే దూరం, కూలీల ఖర్చును బట్టి రూ.85,366 అంచనా వ్యయంగా నిర్ణయించింది. ఈ నిబంధనతో చాలా మంది రైతులు నిర్మాణాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది.

**దెబ్బతీసిన బిల్లుల చెల్లిపులో తీవ్ర జాప్యం**


ప్రారంభంలో కొందరు రైతులు ఉత్సాహం చూపారు. తీరా కల్లాల నిర్మాణం పూర్తయ్యాక బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగి రైతులు చొరవ చూపడం మానేశారు. అలాగే ఉపాధి జాబ్ కార్డు ఉన్న కొందరు రైతుల్లో అర ఎకరం నుంచి మూడెకరాల భూములు ఉన్న వారే ఎక్కువ. ఇందులో కొంత భూమిని కల్లం నిర్మించేందుకు వినియోగిస్తే దిగుబడులు తగ్గుతాయి. ఇది తమకే నష్టమని కల్లాల నిర్మాణంపై ఆసక్తి చూపలేదు.

పొలాల్లో కల్లాలు నిర్మించుకుంటే ఉత్పత్తుల నూర్పిడి, ఆరబెట్టు కోవడం సౌకర్యంగా ఉంటుందనే విషయమై అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. దీంతో రైతులు సమీపంలోని రహదారులనే కల్లాలుగా వాడుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం కల్లాల నిర్మాణం ఆగిపోయిందని ఉపాధి హామీ పథకం ఉద్యోగులు చెప్పారు.

ఇవీ ప్రయోజనాలు

ఉత్పత్తులను పొలంలోనే నూర్పిడి చేసి ఆరబెట్టుకోవచ్చు.

అక్కడే నేరుగా బస్తాల్లో నింపి విక్రయానికి విపణులకు లేదంటే నిల్వ చేయడానికి ఇళ్లకు తరలించుకోవచ్చు.




వాస్తవంలో ఇదీ పరిస్థితి

ఉపాధి హామీ పథకం కింద నిర్మాణం

శ్రీకారం.. 2019–2020

నిర్దేశించిన యూనిట్లు: 3,557

పూర్తయినవి: 221

కేటాయించిన నిధులు: రూ.26.05 కోట్లు

ఖర్చు చేసింది: రూ.1.10 కోట్లు

ఒక్కో యూనిట్ వ్యయం.. రూ.81వేలు

సొంత నిర్మాణం.. నేటికీ ఉపయోగం

ఆర్థికంగా ప్రోత్సహించడంతో రంగాపూర్‌లో రైతు రాజు నిర్మించుకున్న కలం నేటికీ ఉపయోగపడుతోంది. సర్కారు సహకారానికి తోడు రైతులు తాము కొంత పోగు చేసుకుని చక్కగా నిర్మించుకున్నారు. పరిగి, దోమ మండలాల్లోని బాసుపల్లి, నస్కల్, బసిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పలువురు రైతులు నేటికీ వాడుకుంటున్నారు.

## కట్టినంత కష్టం

హైదరాబాద్ : జీహెచ్ఎంసీ ప్రణాళిక విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. కిందిస్థాయిలో సమస్య నెలకొనడంతో, ఇంటి నిర్మాణ దరఖాస్తులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. రెండు వారాల్లో మంజూరవ్వాల్సిన అనుమతి.. రెండు, మూడు నెలలైనా రావడం లేదు. దీంతో అనుమతులు లేకుండానే పనులు ప్రారంభిస్తున్నారు.

కొరవడిన పరిశీలన..

టీజీబీపాస్ చట్టం వచ్చాక చిన్న ఇళ్లకు స్వీయ ధ్రువీకరణతో నిమిషాల్లో ప్రాథమిక అనుమతి లభిస్తోంది. రెండు వారాల్లోపు సంబంధిత టీపీఎస్ (టౌన్ ప్లానింగ్ సెక్షన్) అధికారి నిర్మాణ ప్రదేశాలన్ని తనిఖీ చేసి, తుది అనుమతి ఇవ్వాలి. అప్పుడే పనులు చేపట్టాలి. ప్రస్తుతం టీపీఎస్‌ల కొరతతో 80శాతం దరఖాస్తులకు క్షేత్ర స్థాయి పరిశీలన జరగట్లేదు.



**ఎన్‌ఫోర్స్‌మెంట్ నిస్తేజం..**

అక్రమ నిర్మాణాల కట్టడికి జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ బృందాలు నాలుగేళ్లుగా పనిచేయట్లేదు. కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించిన న్యాక్ ఇంజినీర్లకు డివిజన్లలోని నిర్మాణాలను పరిశీలించే బాధ్యత అప్పగించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. పునాది దశలోనే అనుమతిలేని నిర్మాణాలను గుర్తించాలన్నది ట్రాస్క్‌ఫోర్స్ కర్తవ్యం. ఆచరణలో ఈ బృందాలు పడకేశాయి. కొందరు న్యాక్ ఇంజినీర్లు అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారు.


**ఏసీపీల స్థాయిలో..**

ఇటీవల ముగ్గురు ఏసీపీలు పదవీ విరమణ చేశారు. ఈ మధ్య కాలంలో జరిగిన రాష్ట్ర స్థాయి బదిలీల్లో జీహెచ్ఎంసీకి ఇద్దరు ఏసీపీ స్థాయి అధికారులను తక్కువ కేటాయించారు. దీంతో జోన్లు, సర్కిళ్ల స్థాయిలో ఏసీపీ, సీపీల కొరత ఏర్పడింది. కూకట్‌పల్లి జోన్‌లో, కేంద్ర కార్యాలయంలోని ఇద్దరు ఏసీపీలకు రెండు బాధ్యతలు, ఇతరత్రా అధికారులకు అదనపు బాధ్యతలు కేటాయించడం గమనార్హం.

## మురుగు పొంగు.. ఇక కనుమరుగు

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో మురుగు పొంగే సమస్యలకు శాశ్వత పరిష్కారంగా జలమండలి చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలను ఇస్తోంది. 90 రోజుల్లో నగరాన్ని సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ నగరంగా మార్చడం లక్ష్యంగా అక్టోబర్ 2న లాంఛనంగా ప్రారంభించిన ప్రత్యేక డ్రైవ్ నెల రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జలమండలి ప్రగతిని సమీక్షించింది. ఇప్పటి వరకు 620 కిలోమీటర్ల మేర డ్రైనేజ్ పైపులైన్లను శుభ్రం చేయగా.. అత్యధిక ఫిర్యాదులు, తరచూ సమస్యలు వచ్చే మ్యాన్‌హోళ్లపై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రతను చేపట్టారు. నెల రోజుల్లో పండగలు, ఇతర ప్రత్యేక పరిస్థితులు ఉన్న నేపథ్యంలో 20 రోజులుగా మ్యాన్‌హోళ్ల క్లీనింగ్ కార్యక్రమం వేగం అందుకుంది. రోజుకు సుమారు 30 కిలోమీటర్ల మేర మురుగు కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తున్నారు. సమస్య వచ్చిన చోటే మళ్లీ మళ్లీ మురుగు పొంగుతోంది. ఈ నేపథ్యంలో అటువంటి మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించడంతోపాటు మురుగునీటి ప్రవాహనికి అడ్డుగా ఉన్న ఇతర సమస్యలను పరిష్కరిస్తున్నారు. మొదటి మూడు నెలల్లో 30 శాతం తగ్గించేందుకు ఈ కార్యాచరణ చేపట్టారు.

**ఆన్‌లైన్ పర్యవేక్షణ..** క్షేత్రస్థాయిలో జరుగుతున్న మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసే పనులను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో పర్యవేక్షించనున్నారు.



జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా జలమండలి ప్రధాన కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి ప్రతి పనిని పరిశీలిస్తున్నారు. మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేశారా?.. లేదా? చేస్తే ఎంత మట్టి వచ్చింది?.. ఏ ఎయిర్‌టెక్ యంత్రాన్ని ఎక్కడి పనులకు ఉపయోగించారనే వివరాలను సేకరిస్తున్నారు. సమస్య: మ్యాన్‌హోళ్ల నుంచి సీవరేజీ ఓవర్‌ఫ్లో

మొత్తం సీవరేజీ లైన్లు: 10 వేల కిలోమీటర్లు

నెలకు వస్తున్న సగటు ఫిర్యాదులు : 66 వేలు

సమస్యలు : పూడిక పేరుకుపోవడం, పాత పైపులైన్లు, వ్యర్థాలు

చేపట్టిన చర్యలు

పూర్తిస్థాయిలో పూడికతీత

అవసరమైన చోట కొత్త పైపులైన్ల ఏర్పాటు


పైపులైన్ల సామర్థ్యం పెంపు

ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల పునరుద్ధరణ




అమరావతి: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై పోక్సో కేసు నమోదైంది. పోక్సో చట్టం కింద తనపై పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేయాలని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో ఇవాళ(సోమవారం) విచారణ జరిగింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. పిటిషనర్‌కు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. క్వాష్ పిటిషన్‌లో అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది.

**చెవిరెడ్డి దుష్ప్రచారం..** కాగా.. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. మైనర్ బాలికపై అత్యాచారం జరిగిందంటూ అవాస్తవ ఆరోపణలతో ఆయన దుష్ప్రచారం చేశారని బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేశారు. దీనిపై చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వాస్తవానికి బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినా పోలీసులు వివరాలు బహిర్గతం చేయలేదు. వివరాల్లోకి వెళ్తే.. పదో తరగతి చదువుతున్న దళిత మైనర్ బాలిక స్కూలు నుంచి ఇంటికి వచ్చే దారిలో గాయాలతో పడి ఉండటం సంచలనంగా మారింది. ఆ బాలికపై అత్యాచారం జరిగిందంటూ వైసీపీకి చెందిన మాజీ మంత్రి రోజా, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తదితరులు హడావుడి చేశారు. అసత్యాలు ప్రచారం చేసి తన బిడ్డ భవిష్యత్‌ను పాడు చేయవద్దని బాలిక తండ్రి వేడుకున్నా లాభం లేకపోయింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం.. బాలికను తొలుత పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది అమ్మాయికి చికిత్స చేస్తుండగా ఆ గదిలోకి మండల వైసీపీ కన్వీనర్ దేవపట్ల నాగార్జునరెడ్డి వంద మందికిపైగా అనుచరులతో వచ్చారు. చికిత్స చేయకుండా అడ్డుకున్నారు. బాలికపై అత్యాచారం జరిగిందని, తాము అండగా ఉంటామని హడావుడి చేశారు. కాసేపటికే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరులతో కలసి అక్కడకు చేరుకుని బాలిక తండ్రితో ఏమీ మాట్లాడకుండానే.. అత్యాచారం జరిగినట్లు రాసేయాలని చెప్పారు. అత్యాచారం జరగలేదని తండ్రి చెబుతున్నా వినిపించుకోలేదు. బాలికను మెరుగైన వైద్యం కోసం అదే రోజు రాత్రి తిరుపతి ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రికి తరలించారు. పోలీసు, రెవెన్యూ అధికారుల ఎదుట ఆ బాలిక తనపై అత్యాచారం జరగలేదని స్పష్టం చేసింది. అయితే వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడకు వచ్చారు. వారి ప్రకటనల ఆధారంగా బాలికపై అత్యాచారం జరిగిందని ఓ పత్రికలో, వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. తన కుమార్తెను వేధించిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత కూడా వైసీపీ నాయకులు, ఓ పత్రిక, వారికి సంబంధించిన సోషల్ మీడియా వాస్తవాలు తెలుసుకోకుండా తమ పరువు ప్రతిష్ఠలు దెబ్బతీసేలా వ్యవహరించారని బాలిక తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలతో తమ గ్రామంలో తమ కులానికే చెందిన రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. తాము దళితులమని తెలిసి కూడా తమ వివరాలను బహిర్గతం చేసి సమాజంలో తలెత్తుకోనివ్వకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. మైనర్ బాలిక అని తెలిసినా తన కుమార్తె ఆస్పత్రిలో చిరిగిన బట్టలతో చికిత్స చేయించుకుంటున్న ఫొటోలు తీసి మీడియాలో చూపించడం ద్వారా తమ గోప్యతను దెబ్బతీశారని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మైనర్ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎర్రావారిపాలెం పోలీసులు కేసు (క్రైమ్ నంబరు 58/2024) నమోదు చేసి ఏ-1గా ఎర్రావారిపాలెం మండలం వైసీపీ కన్వీనర్ దేవపట్ల నాగార్జున రెడ్డి, ఏ-2గా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్లు చేర్చారు. ఎంపీ గురుమూర్తి, రోజా, భూమన, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డిని కూడా నిందితులుగా చేర్చే అవకాశాలు ఉన్నాయి.




## తిరుమల శ్రీవారి దర్శనాలపై టీటీడీ కీలక నిర్ణయం.. భక్తులకు అలర్ట్..

తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం ప్రారంభం కానుంది. సోమవారం ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా టీటీడీ భక్తులను అప్రమత్తం చేస్తూ.. అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం (17వ తేదీ) నుంచి జనవరి 14 వరకు సుప్రభాత సేవలను టీటీడీ అధికారులు రద్దు చేశారు. స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. నెల రోజుల పాటు స్వామివారికి తిరుప్పావైతో మేల్కొలుపు ఉంటుంది. అలాగే ఈ నెల రోజుల పాటు శ్రీకృష్ణ స్వామివారికి ఏకాంత సేవ నిర్వహిస్తారు.

**తిరుప్పావై నివేదన...** తిరుమలలో ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష నైవేద్యాలుగా దోశ, బెల్లం దోశ, సీరా, పొంగల్ వంటి ప్రసాదాలను నివేదిస్తారు. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో రోజుకు ఒకటి వంతున అర్చకులు నివేదిస్తారు.

**శ్రీవారి భక్తులకు అలర్ట్..** ధనుర్మాసం ప్రారంభం అయిన నేపథ్యంలో టీటీడీ అధికారులు శ్రీవారి భక్తులను అలర్ట్ చేశారు. జనవరి 14వ తేదీ వరకు సుప్రభాత సేవలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఇవాళ దర్శనాలకు 12 గంటల సమయం పడుతోంది. తిరుమల.. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 18 కంపార్టుమెంట్లలో భక్తులు వేచివున్నారు. టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది.

కగా నిన్న శ్రీవారిని 66,160 మంది భక్తులు దర్శించుకున్నారు. 22, 724 మంది భక్తులు..తలనీలాలు సమర్పించారు. నిన్న స్వామి వారి హుండీ ఆదాయం రూ. 3.47 కోట్లుగా నమోదు ఐంది. అలాగే సోమవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు పద్మావతి అమ్మవారి ఆలయం సుప్రభాత సేవ రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.

## వైసీపీ నేత పేర్ని నాని సతీమణి కేసు విచారణ వాయిదా.. ఎందుకంటే..



కృష్ణా: వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ ఈనెల 19కి వాయిదా పడింది. 185 టన్నుల రేషన్ బియ్యాన్ని మాయం చేశారనే అభియోగాలపై పేర్ని నాని సతీమణి జయసుధపై మచిలీపట్నం (బందరు) తాలుకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేయకుండా తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆమె గత శుక్రవారం జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ పిటిషన్‌ను తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టుకు జిల్లా జడ్జి బదిలీ చేశారు. కాగా, నేడు విచారణ చేపట్టిన న్యాయస్థానం పోలీసుల నుంచి సీడీ ఫైల్ రాకపోవటంతో విచారణను ఈనె 19కి వాయిదా వేసింది. అయితే గత వారం రోజులుగా పేర్ని నాని కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఆయన కుటుంబ సభ్యుల కోసం బందరు పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. నాని సన్నిహితుల కాల్ డేటాను సైతం పోలీసులు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

**ఆచూకీ తెలిపితే బహుమతి..** మరోవైపు కనిపించకుండా పోయిన వైసీపీ నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీల ఆచూకీ తెలిపితే రూ.1, 116 బహుమతిగా ఇస్తానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటివరకూ రెచ్చిపోయిన వారిద్దరూ సైలెంట్ అయిపోయా రని ఆయన అన్నారు. వైసీపీ అధినేత జగన్ విధానాలు, పోకడలు నచ్చకే ఆ పార్టీని అనేక మంది నేతలు వీడుతున్నట్లు చెప్పారు. మరికొన్ని రోజుల్లో వైసీపీ ఖాళీ అవ్వడం ఖాయమని బుద్దా వెంకన్న జోస్యం చెప్పారు.

**ప్రజాధనం మేస్తున్నారు..** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి హాజరుకాని 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామా చేయాలని బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతినెలా వారు రూ.1.75 లక్షల జీతం తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంత జీతం తీసుకుంటున్నా వారు ప్రజల గురించి ఏ ఒక్కరోజూ మాట్లాడలేదన్నారు. అసెంబ్లీకి హాజరుకాని వైసీపీ ఎమ్మెల్యేలను మేకలుగా పరిగణిస్తామని, వైసీపీలో 11మేకలు ఉన్నాయని, అవి ప్రజాధనాన్ని శుభ్రంగా మేస్తున్నాయని బుద్దా ఎద్దేవా చేశారు. వాటిలో పెద్ద మేక ఎప్పుడు ఏం మాట్లాడుతుందో తెలియదని, గతంలో సీఎంగా పనిచేసిన ఆ వ్యక్తికి ప్రజలు తగిన బుద్ధి చెప్పటంతో బెంగళూరుకు పారిపోయాడని ఆయన విమర్శించారు.

వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరు రాకుండా ఎన్నుకున్న ప్రజలను అవమానిస్తున్నారని బుద్దా వెంకన్న మండిపడ్డారు.

## హత్యా రాజకీయాలకు తావు లేదు: మంత్రి అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం: పలాసలో తెదేపా నేత హత్యకు కుట్రపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. వైకాపా నేతలు ఐదేళ్లపాటు హత్యా రాజకీయాలు ప్రోత్సహించారని, అధికారం కోల్పోయినా అదే పద్ధతి కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. కుట్ర వెనక ఎంతటివారున్నా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లాలో హత్యా రాజకీయాలకు తావు లేదన్నారు. పలాస పట్టణానికి చెందిన ఓ తెదేపా నేత హత్యకు కుట్ర జరుగుతోందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుసుకున్న పోలీసులు.. ముందస్తుగానే నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం వార్తలు వచ్చాయి. వారంతా బిహార్ నుంచి వచ్చారని, హతమార్చేందుకు రూ.10 లక్షలు సుపారీ తీసుకున్నారని సమాచారం రావడంతో ముఠాకు చెందిన ముగ్గురిని టెక్కలి దగ్గర అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నాటు తుపాకులు, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. హత్యకు సుపారీ ఇచ్చిన వారి వివరాలు నిందితులు వెల్లడించడంతో వారిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

## పొగమంచు.. విశాఖకు విమానాల రాక ఆలస్యం

విశాఖ: పొగ మంచు కారణంగా విశాఖకు రావాల్సిన పలు విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. హైదరాబాద్ -విశాఖ, చెన్నై-విశాఖ విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

45 నిమిషాల ఆలస్యంగా నడుస్తున్నట్లు చెప్పారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో బెంగళూరు నుంచి రావాల్సిన విమానం అక్కడి నుంచి బయలుదేరలేదు.

## ఏపీ నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం

దిల్లీ: ఏపీ నుంచి ఎన్నికైన ముగ్గురు నేతలు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు. రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వారి చేత ప్రమాణం చేయించారు. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో తెదేపా నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్ బాబు, భాజపా నుంచి ఆర్.కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.

## రాజధాని రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం: మంత్రి నారాయణ



మంగళగిరి: రాజధాని రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. నీరుకొండలో ఎంజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేయాలని ఆర్-5 జోన్ తీసుకొచ్చిందని ఆరోపించారు. ఆర్-5 జోన్‌లో పట్టాలిచ్చిన పేదలకు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో స్థలాలిస్తామని చెప్పారు. సుప్రీంకోర్టులో రాజధానిపై ఉన్న కేసులు పరిష్కరించేలా ముందుకెళుతున్నట్లు పేర్కొన్నారు. మరో 9 నెలల్లో అమరావతిలో అధికారులకు నివాసాలు అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో చెప్పిన విధంగానే రాజధానిని తప్పకుండా పూర్తిచేస్తామని.. మూడేళ్లలో ఇది సాధ్యం కానుందన్నారు. ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు సంబంధించిన టెండర్లకు సీఆర్‌డీఏ ఆమోదం లభించిందని.. నాలుగైదు రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి నారాయణ చెప్పారు.

## రేడియేటర్‌లో నీళ్ల కోసం విద్యార్థిని పంపిన డ్రైవర్.. కుంటలో పడి ఇద్దరి మృతి



గురజాల: పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడు వద్ద నీటి కుంటలో పడి ఇద్దరు మృతి చెందారు. శ్రీ చైతన్య పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి , స్కూల్ బస్సు క్లీనర్‌లు నీట మునిగి చనిపోయారు. దాచేపల్లి వెళ్తుండగా మార్గమధ్యంలో శ్రీ చైతన్య స్కూల్ బస్సు నిలిచిపోయింది. బస్సు రేడియేటర్‌లో నీళ్లు అయిపోవడంతో ఆగిపోయింది. దీంతో నీటి కోసం ఐదో తరగతి విద్యార్థిని డ్రైవర్ పంపాడు. సమీపంలోని కుంట వద్దకు వెళ్లిన విద్యార్థి అందులో పడిపోయాడు. విద్యార్థిని కాపాడేందుకు నీటి కుంటలో దిగిన క్లీనర్ కోటేశ్వరరావు కూడా నీట మునిగి చనిపోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## ఏపీ వాహనదారులకు గుడ్ న్యూస్.. ఆ హైవే ఆరు లైన్లుగా విస్తరణ

ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు విస్తరణపై ఫుల్ ఫోకస్ జరుగుతోంది. కొత్తగా పలు నేషనల్ హైవేలను అభివృద్ధి చేస్తున్నారు. అలాగే మరికొన్నింటిని విస్తరించే దిశగా అడుగులు పడుతున్నాయి. జాతీయ రహదారుల విస్తరణపై ఇప్పటికే కసరత్తు మొదలైపోయింది. చాన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న హైవేల విస్తరణ మీద కూడా దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని ఓ ప్రధాన రహదారిని ఆరు లైన్లుగా విస్తరించాలని భావిస్తున్నారు.

దీనిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష కూడా చేశారు. మరి.. ఆ హైవే ఏంటి అనేది ఇప్పుడు చూద్దాం..

**త్వరలో షురూ..** శ్రీకాకుళం జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ అంశంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష నిర్వహించారు. నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం దాకా నేషనల్ హైవేను ఆరు లైన్లుగా విస్తరించనున్నట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. దీని మీద కేంద్ర సర్కారు సానుకూలంగా ఉందన్నారు. ఈ హైవే సమస్యను పరిష్కరించాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరామని చెప్పారు. త్వరలో విస్తరణ పనులు స్టార్ట్ అయ్యే ఛాన్స్ ఉందన్నారు.

**రవాణా మరింత వేగవంతం...** నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరలో మొదయల్యే అవకాశం ఉందన్నారు రామ్మోహన్ నాయుడు. ఈ మేరకు హైవే ప్రాజెక్టుల మీద అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ఈ హైవే విస్తరణ ద్వారా ప్రయాణ సమయం తగ్గడంతో పాటు సరుకు రవాణా మరింత వేగవంతం అవుతుందన్నారు.

కొత్తగా నిర్మించబోయే భోగాపురం-మూలపేట పోర్టు గురించి కూడా ఆయన అధికారులతో చర్చించారు. ఈ పోర్టును అనుసంధానం చేసేలా వైజాగ్-మూలపేట బీచ్ కారిడార్ రోడ్డు ప్రతిపాదనలపై పనుల పురోగతి ఆయన అడిగి తెలుసుకున్నారు.

## విజన్ గురించి ప్రిజనరీకి ఏం తెలుస్తుంది?: మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి: విజన్ గురించి ప్రిజనరీకి ఏం తెలుస్తుందని జగన్‌ను ఉద్దేశించి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దోచుకోవడం, దాచుకోవడంలో జగన్‌ను మించినోళ్లు లేరని ఎద్దేవా చేశారు. విజన్ 2020ని ఎగతాళి చేసినోళ్లే నేడు ఫలితాలు అనుభవిస్తున్నారని చెప్పారు. "ఉద్యోగాల గురించి మాట్లాడే జగన్.. సైబరాబాద్ చూసి తెలుసుకోవాలి. వైకాపా ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ ఉద్యోగమూ భర్తీ చేయలేదు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టిన చరిత్ర జగన్‌ది. చంద్రబాబు, విజన్‌పై మాట్లాడే నైతిక అర్హత ఆయనకు లేదు. రాష్ట్రానికి జగన్ చేసిన ద్రోహాన్ని గుర్తించిన ఏ ఒక్కరూ క్షమించరు" అని కొల్లు రవీంద్ర మండిపడ్డారు.

## మోడ్రన్ అప్సరసలా రెజీనా మెరుపులు

సౌత్ లో గ్లామరస్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకున్న అందాల భామ రెజీనా కసాండ్ర. ఈ అమ్మడు 2005లో నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే 2010లో శివ మనసులో శృతి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. నెక్ట్స్ సందీప్ కిషన్ కి జోడీగా రొటీన్ లవ్ స్టోరీ అనే మూవీలో చేసింది. ఈ సినిమాలు ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. అయితే రవితేజకి జోడీగా చేసిన 'పవర్', సాయి ధరమ్ తేజ్ మొదటి సినిమా 'పిల్లా నువ్వు లేని జీవితం' రెజీనాకి కమర్షియల్ బ్రేక్ ఇచ్చాయి. ఈ సినిమాల తర్వాత అమ్మడు వెనక్కి తిరిగి చూసుకోలేదు. వరుసగా తెలుగులో అవకాశాలు అందుకుంది. అలాగే మాతృభాష తమిళంలో



కూడా మంచి ఛాన్స్ లు అందుకుంది. ఆమె చివరిగా తెలుగులో 'ఎవరు' అనే మూవీతో సూపర్ హిట్ అందుకుంది. ఆ తరువాత చెప్పుకోదగ్గ మూవీస్ పడలేదు. తమిళంలో కూడా వరుసగా సినిమాలు చేస్తోన్న స్టార్ హీరోలతో జోడీ కట్టే అవకాశాలు మాత్రం రావడం లేదు. రీసెంట్ గా తెలుగులో 'ఉత్సవం' అనే మూవీతో రెజీనా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ పెద్దగా మెప్పించలేదు. అజిత్ 'విడాముయార్చి' సినిమాలో రెజీనా కీలక పాత్రలో నటించింది. హిందీలో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాబీ డియోల్ హీరోగా తెరకెక్కుతోన్న 'జాట్' మూవీలో నటించింది. అలాగే 'సెక్షన్ 108', 'ఫ్లాష్ బ్యాక్' అనే హిందీ సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. ఇలా ఈ బ్యూటీ చేతిలో నాలుగు సినిమాలున్నాయి. ఇదిలా ఉంటే ఈ రోజు రెజీనా కసాండ్రా బర్త్ డే సందర్భగా సోషల్ మీడియాలో చాలా మంది ఆమెకి విషెస్ చెబుతున్నారు. IIFA ఉత్సవం ఇన్ స్టాగ్రామ్ పేజీలో రెజీనా గ్లామరస్ ఫోటోని షేర్ చేసి బర్త్ డే విషెస్ చెప్పారు. ఈ ఫోటోలో అమ్మడు చాలా కలర్ ఫుల్ గా ఉంది. వైట్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో అదిరిపోయే అందంతో కట్టిపడేస్తోంది. చూడగానే మోడ్రన్ అప్సరసలా రెజీనా ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. హీరోయిన్ గా ఛాన్స్ లు తగ్గిన రెజీనా తన టాలెంట్ తో విభిన్న క్యారెక్టర్స్ చేస్తూ దూసుకుపోతోంది. గ్లామర్ రోల్స్ కి కూడా రెజీనా పెర్ఫెక్ట్ ఛాయస్ అని ఈ ఫోటోలు చూస్తుంటే అనిపిస్తోంది.

## నయనతార గురించిన బ్రహ్మరహస్యం?

అగ్ర కథానాయిక నయనతార గురించి ఒక బ్రహ్మరహస్యం తెలిసింది. నయన్ పుట్టి పెరిగింది ఓ మలయాళ కుటుంబంలో అయినా కానీ, తాను మలయాళం పూర్తిగా అర్థం చేసుకోలేదు. తనకు తమిళం వచ్చినంతగా మరో భాష కూడా రాదు. తనకు ఉన్న భాష సమస్య కారణంగా ఓసారి సెట్లో చాలా ఇబ్బంది పడింది. ఓవైపు సీన్ చేస్తుంటే, సరిగా రావడం లేదు. తనకు దర్శకుడు మాట్లాడుతున్న మలయాళ భాష అస్సలు అర్థం కావడం లేదు. ఆమెకు భాష బాగా తెలియదు కాబట్టి నిజమైన భావోద్వేగాలను సృష్టించలేకపోయింది. ఓవైపు ఇంకా పర్ఫెక్షన్ కావాలని దర్శకుడు, హీరో మోహన్ లాల్ అడుగుతూనే ఉన్నారు. కానీ ఎందుకనో ఆ సీన్ చేయలేకపోయింది. తీవ్ర ఒత్తిడికి గురైంది. చివరకు అదుపుతప్పి మోహన్‌లాల్‌పై



విరుచుకుపడింది.. భాష అర్థం కానప్పుడు దానిని ఎక్స్ ప్రెషన్ లో ఎలా చూపించాలి? అంటూ ఎదురు ప్రశ్నించింది. చివరకు తన ము ఖంలో నిరాశకు మోహన్‌లాల్ సహా ఇతరులు నవ్వుకున్నారు. ఆ సమయంలో నయనతార చాలా భయపడ్డానని తెలిపింది. చివరకు రెస్ట్ తీస్కో అమ్మా అని దర్శకుడు ప్యాకప్ చెప్పారట. నిజానికి నయనతార బెంగుళూరులో స్థిరపడిన ఒక సాధారణ మలయాళం మాట్లాడే ఇంట్లో మలయాళీ తల్లిదండ్రులకు జన్మించింది. నయన్ నస్రానీ క్రిస్టియన్‌గా పెరిగారు. 7 ఆగస్టు 2011న చెన్నైలోని ఆర్యసమాజ్ ఆలయంలో నయనతార హిందూమతాన్ని స్వీకరించారు. ఆ తర్వాత తనకు హిందూ మతంలోకి మారినట్లు సర్టిఫికెట్ జారీ అయింది. ఆమె స్టేజ్ పేరు, నయనతార అధికారిక పేరుగా మారింది. నయనతార లవ్ స్టోరి గురించి తెలిసిందే.

దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో నయన్ 2015లో నానుమ్ రౌడీ ధాన్‌లో కలిసి పనిచేసినప్పటి నుండి రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. ఈ జంట 9 జూన్ 2022న మహాబలిపురంలో వివాహం చేసుకున్నారు. కొద్దిమంది కుటుంబ సభ్యులు, స్నేహితులు మాత్రమే హాజరయ్యారు. అక్టోబరు 2022లో ఈ జంట సరోగసీ ద్వారా ఉయిర్ – ఉలగం అనే కవల పిల్లలు పుట్టినట్లు ప్రకటించారు. వారి కవల అబ్బాయిల పూర్తి పేరు ఉయిర్ రుద్రోనీల్ ఎన్ శివన్ – ఉలాగ్ దైవిక్ ఎన్ శివన్. ఈ పేర్లలో %చీ% అంటే వారి తల్లి నయనతార.




## డాకు మహారాజ్.. హై వోల్టేజ్ కిక్!




నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కిన 'డాకు మహారాజ్' మూవీ సంక్రాంతి రేసులో ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. భారీ బడ్జెట్ తో యాక్షన్ బ్యాక్ డ్రాప్ కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ టీజర్ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేసింది. నందమూరి అభిమానులు ఈ సినిమా కోసం ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తున్నారు. కచ్చితంగా సంక్రాంతి రేసులో బాలయ్యకి ఈ చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ రావడం ఖాయం అని అనుకుంటున్నారు. ఇది ఇలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చారు. హీరో క్యారెక్టరైజేషన్ ఎలివేట్ చేసే విధంగా పవర్ఫుల్ గా ఉన్న ఈ లిరికల్ వీడియోకి అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. అనంత శ్రీరామ్ లిరిక్స్ అందించిన ఈ పాటకి తమన్ స్వరాలు సమకూర్చారు. నకాష్ అజీజ్, భరత్ రాజ్, రితిష్ జి రావు, కె ప్రణతి ఈ సాంగ్ ని ఆలపించారు. ది రేజ్ ఆఫ్ డాకు టైటిల్ తో ఈ ఫస్ట్ సింగిల్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకొని వచ్చారు. ఇందులో 'డాకు మహారాజ్' పోరాటం ఎలా ఉంటుంది. ఎందుకోసం అతను పోరాడుతున్నాడు. పేద ప్రజల గుండెల్లో అతనికున్న స్థానాన్ని రిప్రజెంట్ చేశారు. హైవోల్టేజ్ లో ఈ సాంగ్ ఉండటం విశేషం. థియేటర్ లో ఈ పాట విన్నప్పుడు ఫ్యాన్స్ కి పూనకాలు రావడం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోంది. వరుస హ్యాట్రిక్ విజయాల తర్వాత బాలయ్య నుంచి మరో పవర్ ఫుల్ కథతో 'డాకు మహారాజ్' చిత్రం రాబోతోంది. 'వాల్తేరు వీరయ్య' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత బాబీ ఈ సినిమా చేస్తున్నాడు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా, శ్రీ చక్ర స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. బాలయ్య కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా భారీ కలెక్షన్స్ కొల్లగొట్టడం గ్యారెంటీ అనుకుంటున్నారు.

ఈ సినిమాలో బాబీ డియోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు. ప్రగ్యా జైశ్వాల్, ఊర్వశీ రౌతేలా హీరోయిన్స్ గా చేశారు. చాందిని చౌదరి ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపిస్తోంది. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవత్ కేసరి' సినిమాలతో బాలయ్య వరుస బ్లాక్ బస్టర్స్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన స్టోరీ సెలక్షన్ కూడా ప్రెజెంట్ ట్రెండ్ కి కనెక్ట్ అయ్యే విధంగా ఉంటున్నాయి. అందుకే 'డాకు మహారాజ్' పైన కూడా అంచనాలు పెరిగిపోయాయి.


## ప్రభాస్ 'స్పిరిట్'లో మృణాల్..!



ప్రభాస్ ఇటీవల 'సలార్', 'కల్కి 2898 ఏడీ' సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ భారీ విజయాలను సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో 'రాజాసాబ్' సినిమాను చేస్తున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ' సినిమాను చేస్తున్నాడు. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాది బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ రెండు సినిమాలు కాకుండా అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమాల దర్శకుడు సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో స్పిరిట్ సినిమాను చేయబోతున్న విషయం తెల్సిందే. వచ్చే ఏడాది ఆరంభంలో సినిమాను ప్రారంభించి అతి త్వరలోనే సినిమాను పూర్తి చేస్తామని, 2026లో సినిమాను విడుదల చేస్తామంటూ మేకర్స్ ప్రకటించారు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసే విషయమై చర్చలు జరుగుతున్నాయి. ఆ మధ్య రష్మిక మందన్నతో చర్చలు జరిగాయి అన్నారు. కానీ తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం మృణాల్ ఠాకూర్ అయితే ప్రభాస్‌కి సరి జోడీ అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అందుకే దర్శకుడు సందీప్ వంగ ఆమెను ఎంపిక చేశారు అంటూ ప్రచారం జరుగుతుంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా స్పిరిట్ సినిమాను రూపొందిస్తున్నారు. యానిమల్ సినిమాతో ఏకంగా రూ.1000 కోట్ల వసూళ్లు సొంతం చేసుకున్న సందీప్ రెడ్డి వంగ స్పిరిట్‌తో అంతకు మించి అన్నట్లుగా వసూళ్లు సొంతం చేసుకునే విధంగా సినిమా ఉంటుంది అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. మృణాల్ ఠాకూర్ తెలుగులో ఇప్పటి వరకు చేసిన సీతారామం, హాయ్ నాన్న సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకోగా, ఫ్యామిలీ స్టార్ సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. అయినా మృణాల్ ఠాకూర్ యొక్క క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు అంటూ ఆమె ఫాలోయింగ్ చెప్పకనే చెబుతుంది. స్పిరిట్ సినిమాను హిందీ నిర్మాత భూషన్ కుమార్ నిర్మించబోతున్నారు. యానిమల్ సినిమాతో బాలీవుడ్‌లో సందీప్ రెడ్డి వంగకి మంచి ఆధరణ లభించింది. కనుక స్పిరిట్ సినిమాను హిందీ ప్రేక్షకులు దృష్టిలో పెట్టుకుని రూపొందించబోతున్నారు. బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉన్న మృణాల్ ఠాకూర్ అయితే స్పిరిట్‌కి పాన్ ఇండియా మూవీ అనే అప్పీల్ వస్తుంది అనే అభిప్రాయంతో మేకర్స్ ఉన్నారు. ఈ విషయమై అధికారికంగా త్వరలోనే ప్రకటన వస్తుందని అంతా భావిస్తున్నారు.

## యాంకర్ స్రవంతి.. వైట్ షర్ట్ లో గ్లామర్ బ్లాస్ట్..

యాంకర్ స్రవంతి చొక్కారపు గురించి అందరికీ తెలిసిందే. కొన్ని నెలలుగా ఇండస్ట్రీ వర్గాల్లో ఆమె పేరు గట్టిగానే వినిపిస్తోంది. స్టార్ హీరోల సినిమాల ఈవెంట్స్ లో హెూస్ట్ గా ఎక్కువగా అమ్మడే కనిపిస్తున్నారు. అనేక టీవీ షోలు, సినీ ప్రముఖులతో ఇంటర్వ్యూలు, వివిధ మూవీ ఫంక్షన్స్ తో బిజీగా బిజీగా గడుపుతున్నారు ముద్దుగుమ్మ. ఇక సోషల్ మీడియాలో స్రవంతికి క్రేజ్ వేరే లెవెల్ లో ఉంది. స్టార్ట్ హీరోయిన్స్ ను మించిన అందంతో సందడి చేస్తుంటారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ ను పోస్ట్ చేస్తుంటారు. ఫుల్ యాక్టివ్ గా ఉంటూ సందడి చేస్తుంటారు. ఫాలోవర్స్ ను ఎప్పుడూ



డిస్సాపాయింట్ చేయరు. అటు మోడ్రన్ గా.. ఇటు ట్రెడిషనల్ గా కనిపిస్తూ మెప్పిస్తుంటారు. గ్లామరస్ గా కనిపిస్తూ నెట్టింట హీట్ పుట్టిస్తుంటారు. తన పిక్స్ తో సెగలు రేపుతుంటారు. అలా ఎప్పుడూ ట్రెండింగ్ లోనే ఉంటారు. తాజాగా కొత్త ఫోటోస్ ను షేర్ చేశారు. జీన్ అండ్ షర్ట్ లో అందాలు ఆరబోశారు. టోర్న్ జీన్ వేసుకున్న అమ్మడు.. వైట్ కలర్ షర్ట్ తో గ్లామర్ షో చేశారు.

ఆ షర్ట్ పై ఉన్న లిప్స్ సింబల్స్ తో అట్రాక్ట్ చేస్తున్నారు. క్రేజీగా జడ వేసుకున్న స్రవంతి.. తన లుక్స్ తో ఫిదా చేశారు. తన అందాలతో మైండ్ బ్లాక్ చేశారు. రకరకాల పోజులతో ఫ్లాట్ చేశారు. అందరి దృష్టిని తనవైపు తిప్పుకున్నారు. ప్రస్తుతం ఆమె పిక్స్ ఫుల్ వైరల్ గా మారాయి. మేడమ్ సర్ మేడమ్ అంతే అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. పిక్స్ సూపర్ అని చెబుతున్నారు.

## పుష్ప లాంటి వాళ్ళు బయట ఉంటారు : రష్మిక

అల్లు అర్జున్, రష్మిక మందన్న నటించిన పుష్ప 2 సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే సినిమా రూ.1100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన విషయం తెల్సిందే. బాక్సాఫీస్ వద్ద రికార్డ్ స్థాయి ఓపెనింగ్స్‌ను రాబట్టిన సినిమాగా పుష్ప 2 నిలిచింది. లాంగ్ రన్‌లో ఆర్‌ఆర్‌ఆర్, బాహుబలి రికార్డులను పుష్ప 2 బ్రేక్ చేయాల్సి ఉంది. ఈ వీకెండ్‌లో పుష్ప 2 కి నమోదు అవుతున్న వసూళ్లపై అందరి దృష్టి ఉంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా పుష్ప 2 సినిమా సాధించిన వసూళ్లు ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉన్నాయి. ఈ సమయంలో హీరోయిన్ రష్మిక మందన్న ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆ ఇంటర్వ్యూలో రష్మిక మందన్న మాట్లాడుతూ... హీరోను దృష్టిలో పెట్టుకుని కథ రాస్తే అతడి పాత్రకు ఎక్కువ ప్రాముఖ్యత దక్కుతుంది, హీరోయిన్ కోసం కథ రాస్తే హీరోయిన్ పాత్రకు ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుంది. పాత్రల స్వభావం అనేది కథను బట్టి ఉంటుంది. మనుషులు అందరిలోనూ మంచి, చెడు ఉంటాయి. ఆయా సమయాల్లో, సందర్భాల్లో మంచి, చెడు బయటకు వస్తూ ఉంటుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యత్యాసం అనేది వారి ఈగోలు



ప్రదర్శించే దాన్ని బట్టి ఉంటుంది. అంతే తప్ప ప్రత్యేకంగా మంచి, చెడు అంటూ ఉండరు అంటూ రష్మిక చెప్పుకొచ్చింది. పుష్ప సినిమాలో పుష్ప రాజ్ పాత్ర స్వభావాన్ని కాకుండా కుటుంబం కోసం అతడు చేసిన మంచిని చూస్తే బాగుంటుంది. కుటుంబం కోసం ఎంత దూరం అయినా వెళ్లేందుకు కొందరు సిద్ధంగా ఉంటారు. అలాంటి వారు నిజ జీవితంలోనూ ఉంటారు. అలాంటి వారిని ప్రేరణగా తీసుకుని పుష్ప సినిమాను రూపొందించారు అన్నట్లుగా రష్మిక మందన్న చెప్పుకొచ్చారు. తన అనుకున్న వారి కోసం ఏం చేసేందుకు అయినా సిద్ధపడే వ్యక్తిగా పుష్పరాజ్‌ను చూపించారు. నిజ జీవితంలో మరో పద్ధతిలో అయినా తన కుటుంబం కోసం చాలా దూరం వెళ్లి ఎంతటి వారిని అయినా ఎదిరించేందుకు సిద్ధంగా ఉండే వారు ఉన్నారు అంది. పుష్ప 2 సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో మరో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న రష్మిక మందన్న త్వరలో గర్ల్ ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇటీవల విజయ్ దేవరకొండ చేతుల మీదుగా ఆ సినిమా టీజర్ విడుదల అయ్యింది. ఆ టీజర్ కోసం విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్ సైతం ఇవ్వడం జరిగింది. సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటించిన ఈ లేడీ ఓరియంటెడ్ సినిమాను వచ్చే ఏడాది ఆరంభంలోనే విడుదల చేసే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఆ సినిమాను విడుదల చేయాలని భావిస్తున్నారు.



# అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్.. ఎందుకంటే

హైదరాబాద్, డిసెంబర్ 16: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. సభ మొదలైన తర్వాత సర్పంచుల పెండింగ్ బిల్లుల అంశం సభలో చర్చకు వచ్చింది. ఈ అంశంపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడిచింది. అయితే మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపిటీసీలకు పెండింగ్ బిల్లులు చెలించడంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రానందుకు నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్ చేశారు. సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా గోస పెడుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు (%ఖీశీతీఎవతీ వీఱఅఱర్‌వతీ ఝతీఅంష్ట్ర ఝశీ%) అన్నారు. గవర్నర్‌ను వెళ్లి కలవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 19 గ్రామ పంచాయితీలకు అవార్డు తెచ్చిన ఘనత కేసీఆర్ ది అని తెలిపారు. అయితే హరీష్ రావు ప్రసంగానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్డు తగిలే ప్రయత్నం చేశారు. దీంతో మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలకు ఇచ్చిన శిక్షణ ఇదేనా అధ్యక్ష అంటూ హరిష్ రావు సెటైర్ విసిరారు. ఆ తరువాత మాజీ మంత్రి తిరిగి మాట్లాడుతూ.. తెలంగాణకు వెళ్తే చికెన్ గున్యా వస్తుందని అమెరికా ఆ దేశ పౌరులను హెచ్చరించిందని.. ఆ పరిస్థితికి పల్లెలను తెచ్చారని మండిపడ్డారు. పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని.. ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు పెన్షన్స్ ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పారని తెలిపారు. పెన్షన్స్ ఏమో గాని అసలు వేతనాలే ఇవ్వడం లేదని హరీష్‌రావు విమర్శించారు.

**బిల్లులు విడుదల చేయాలి: పల్లా...** ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లి సర్పంచ్ బిల్లులు రాక ఇల్లును కుదువ పెట్టుకున్నారని తెలిపారు. బిల్లుల కోసం సర్పంచ్ లు కలుద్దామని హైదరాబాద్‌కు వస్తే అరెస్టు చేస్తున్నారన్నారు. సర్పంచ్ లు చేసిన పనుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**పెండింగ్‌లు పెట్టిందే బీఆర్ఎస్: నాయిని :** సర్పంచుల బిల్లులు పెండింగ్ పెట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వం అంటూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ బిల్లులు పెండింగ్ పెడితే ఆ బరువు తాము మోస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అన్ని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు రూ.1000 కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. పార్టీ కార్యాలయాలను కూడా వారు కబ్జాలు పెట్టారని నాయిని రాజేందర్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

**మంత్రి సీతక్క సమాధానం...** సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులపై మంత్రి సీతక్క సమాధానమిస్తూ.. సర్పంచ్‌ల పదవి కాలం ఫిబ్రవరిలో ముగిసిందని.. ఇప్పుడున్న పెండింగ్ బిల్లులు బీఆర్ఎస్ నుంచి వారసత్వంగా వచ్చినవే అని మంత్రి సీతక్క అన్నారు. హరీష్ రావు ఫైనాన్స్ మంత్రిగా ఆనాడు సంతకం పెడితే బిల్లులు క్లియర్ అయ్యేవన్నారు. కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులు ఇవ్వలేదని.. తాము పెండింగ్ బిల్లులు చెల్లించం అనడం లేదని అన్నారు. కచ్చితంగా బీఆర్ఎస్ వారసత్వంగా ఇచ్చిన బకాయిలు, పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. "బీఆర్ఎస్ అంటే బకాయిల రాష్ట్ర సమితిగా మాకు పెండింగ్ బిల్లులు ఇచ్చింది" అంటూ మంత్రి సీతక్క వ్యాఖ్యలు చేశారు.

**బీఆర్ఎస్ వాకౌట్ :** అయితే సర్పంచుల పెండింగ్ బిల్లులపై మంత్రి సమాధానానికి నిరసనగా బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. ఆనాడు తాము పల్లె ప్రగతి కింద రూ. 3300 కోట్లు పంచాయితీలకు ఇచ్చామని హరీష్‌రావు తెలిపారు. ప్రతినెల రూ.227 కోట్లు పంచాయితీలకు ఇచ్చామన్నారు. ఆ విధానాన్ని కాంగ్రెస్ కొనసాగించి ఉంటే ఈరోజు ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. మంత్రి సమాధానం సరిగా లేని కారణంగా సభ నుండి వాకౌట్ చేస్తున్నామని హరీష్‌రావు తెలిపారు.

**మంత్రి ఆగ్రహం...** గత ప్రభుత్వం బకాయి పెట్టిన బిల్లుల్ని తాము ఒక్కొక్కటిగా క్లియర్ చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కానీ బీఆర్ఎస్ సభను పక్కదారి పట్టిస్తోందని మండిపడ్డారు. రాజకీయంగా పరపతిని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జాబ్ క్యాలెండర్ మేరకు నోటిఫికేషన్లు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్: ఉద్యోగ ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షల నిర్వహణ చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీక్, మాల్ ప్రాక్టీస్ జరగకుండా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేపడుతున్నట్లు వివరించారు. ఉద్యోగాల భర్తీ కోసమే జాబ్ క్యాలెండర్ ప్రకటించామని.. దశలవారీగా భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపడతామన్నారు. జాబ్ క్యాలెండర్ మేరకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

**రేషన్ బియ్యం అక్రమ రవాణా వాస్తవం: మంత్రి ఉత్తమ్...** రేషన్ కార్డుల లెక్కలు పొంతన లేకుండా ఉన్నాయని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కాకినాడ పోర్టుకు రేషన్ బియ్యం పోతోందని అనుమానాలు వ్యక్తం చేశారు.

దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వాస్తవమన్నారు. ప్రజలు దొడ్డు బియ్యం తినట్లేదని.. సన్న బియ్యం ఇవ్వాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

# అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్‌లోనూ ప్రత్యేక చర్యలు: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్: అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్‌లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. ఆ ప్రాంతంలో విద్య, ఉపాధి దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. పులి దాడుల్లో చనిపోతే రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కవ్వాల్‌లో ఇటీవల పులులు దాడులకు పాల్పడుతున్నాయని చెప్పారు.



అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్‌లోనూ చర్యలు తీసుకోవాలన్నారు. అడవి బిడ్డలు అడవిని ధ్వంసం చేయకుండా జీవిస్తున్నారని భారాస ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ చెప్పారు. పులి దాడుల్లో మరణించిన వారికి రూ.20 లక్షలు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు.

# కక్షతో సర్పంచులను ఇబ్బందులు పెడుతున్నారు: హరీశ్‌రావు

హైదరాబాద్: తెలంగాణలో రూ.691 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఏడాదిగా బిల్లులు చెల్లించకుండా సర్పంచులను గోస పెడుతున్నారని విమర్శించారు. గవర్నర్, మంత్రులను కలిసి వారు మొరపెట్టుకున్నారని చెప్పారు. చలో అసెంబ్లీ చేపడితే నిరసనకారులను అరెస్టు చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో ఏడాదిగా గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వట్లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం, ఈజీఎస్ నిధులను మళ్లించారని ఆరోపించారు. తెలంగాణ పల్లెలను భారాస దేశానికి ఆదర్శంగా నిలిపిందని వివరించారు. కక్షతో సర్పంచులను ఇబ్బందులు పెడుతున్నారని.. గ్రామ పంచాయతీ ఎన్నికల లోపు బిల్లులు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లగచర్ల రైతులకు బేడీలు వేసి అవమానించారని పేర్కొంటూ అంతకు ముందు భారాస ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా



నినాదాలు చేస్తూ ప్లకార్డులతో అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకొని ప్లకార్డులు తీసుకొని లోపలికి పంపించారు

# ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుంది.. జగదీశ రెడ్డి ధ్వజం

ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు జగదీశ్ రెడ్డి అన్నారు. ఎంత తప్పించుకున్నా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ప్రజలపై పడిందని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేసిందని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ పేరుతో బడాబాబులకు దోచిపెట్టే కుట్రకు తెరతీసిందని ఆరోపించారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. జైలులో ఉన్న లగచర్ల గిరిజన రైతులపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారని అన్నారు. లగచర్ల ఘటనపై చర్చకు కోరితే ప్రభుత్వం పారిపోయిందని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ రాష్ట్ర ప్రభుత్వంలో భాగం కాదన్న విషయం గుర్తించాలని జగదీశ్ రెడ్డి సూచించారు. స్పీకర్ మా నోరు నొక్కుతున్నారని తిట్లు తిట్టేవారికే అవకాశం కల్పిస్తున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల రైతుల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తిపై ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలన నుంచి పారిపోతోందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.




దిల్లీ: బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడారు. ఆ దాడులపై భారత్ గళం విప్పాలని కోరారు. "బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందూ, క్రిస్టియన్‌లపై జరుగుతున్న దాడులపై భారత ప్రభుత్వం గళం విప్పాలి. ఆ దేశంతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దేందుకు అక్కడి ప్రభుత్వాన్ని కోరాలి" అని అన్నారు. విజయ దివస్ సందర్భంగా 1971 యుద్ధంలో అమరులైన వారికి లోక్‌సభ వేదికగా సెల్యూట్ చేశారు. ఆనాటి తూర్పు పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్) పరిస్థితిని ఇందిరాగాంధీ ధైర్యంగా చక్కదిద్దారని కొనియాడారు. ప్రియాంకా బ్యాగ్ అందరి దృష్టిని ఆకర్షించింది. దానిపై 'పాలస్తీనా' అని ఇంగ్లీష్‌లో రాసి ఉంది. ఇజ్రాయెల్ దాడులతో దుర్భర పరిస్థితులను అనుభవిస్తోన్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఆమె దానిని తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే.. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్‌హసీనా దేశం విడిచివెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయసాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి. దీనిపై ఇటీవల విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ.. దాడులను నివారించడానికి ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం మైనారిటీలు, హిందువుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈవిషయంపై ఇటీవల భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి నేతలతో చర్చలు జరిపారన్నారు.




# చలి పులి.. హైదరాబాద్‌లో భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మౌలాలి, హెచ్‌సీయూ ప్రాంతాల్లో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, బీహెచ్‌ఈఎల్‌లో 7.4, రాజేంద్రనగర్‌లో 8.2 డిగ్రీలు, గచ్చిబౌలి 9.3, వెస్ట్ మారేడ్‌పల్లిలో 9.9, కుత్బుల్లాపూర్ 10.2, మచ్చబొల్లారంలో 10.2, శివరాంపల్లిలో 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, షాపూర్ నగర్ 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరెడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, చాంద్రాయణగుట్ట 13, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ 13.3, హయత్ నగర్ 13.3, ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శనగర్ 13.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు కనిష్ఠస్థాయికి పడిపోయాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తిరుమలగిరిలో 13.6, చర్లపల్లిలో 13.6 డిగ్రీలు నమోదయ్యాయి. (%ఐవశ్రీఖఅస్త్రుఖు అవషం%). తాండ్ర(నిర్మల్)లో 6.3 డిగ్రీలు, పోచర(ఆదిలాబాద్) 6.4, జైనథ్(ఆదిలాబాద్) 6.5, అర్లి(టి)(ఆదిలాబాద్) 6.6, చాప్రాల్(ఆదిలాబాద్) 6.6, నత్వార్(సంగారెడ్డి) 6.6, బంట్వారం(వికారాబాద్)6.7, న్యాల్కల్(సంగారెడ్డి) 6.7, ఎలిమినేడు(రంగారెడ్డి) 6.7, సిర్పూర్(యూ)(ఆసిఫాబాద్) 6.7, చందనవల్లి(రంగారెడ్డి) 6.7, కోహిర్(సంగారెడ్డి) 6.7, మర్పల్లి(వికారాబాద్) 6.8, నగరం(టి)(వికారాబాద్) 6.8, మన్నెగూడ(వికారాబాద్) 6.8, నల్లవెల్లి(సంగారెడ్డి) 6.8, పోతరరెడ్డిపేట(సిద్దిపేట) 6.9, జహీరాబాద్(సంగారెడ్డి) 6.9, మెనూర్(కామారెడ్డి) 6.9, రాఘవపేట(జగిత్యాల) 7.3, కెరమెరి(ఆసిఫాబాద్) 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.




# మోహన్‌బాబు అరెస్టు విషయంలో ఆలస్యం లేదు: సీపీ

హైదరాబాద్: సినీ నటుడు మోహన్‌బాబు అరెస్టు విషయంలో ఎలాంటి ఆలస్యం లేదని, చట్ట ప్రకారమే అంతా జరుగుతోందని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ఇప్పటివరకూ మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. మరికొన్ని ఫిర్యాదులకు సంబంధించి మేము ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకముందే.. మరొకసారి వచ్చి పూర్తి వివరాలు చెబుతామని అంటున్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. చట్టపరంగా ఎలా ముందుకువెళ్లాలో అలాగే వెళ్తాం. మోహన్‌బాబును విచారించే విషయంలో మెడికల్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఇప్పటికే మేం నోటీసులు ఇచ్చాం. డిసెంబరు 24వ తేదీ వరకూ సమయం అడిగారు. మోహన్‌బాబు వల్ల రంజిత్ గాయపడ్డారు కాబట్టి, సానుభూతితో పలకరించడానికి వెళ్లి ఉంటారు. అయితే, చట్టప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోవాలో అలాగే తీసుకుంటాం. మరోవైపు కోర్టు కూడా ఆయనకు సమయం ఇచ్చింది. కోర్టు ఆదేశాలను మేం గౌరవిస్తాం. ఈలోగా మరోసారి మోహన్‌బాబుకు నోటీసు ఇచ్చి, గడువు కన్నా ముందే విచారణ చేపట్టవచ్చా? అని కోర్టును అడుగుతాం. కోర్టు ఇచ్చే సూచనలను బట్టి నడుచుకుంటాం" "మోహన్‌బాబు దగ్గర ఉన్న గన్స్ ఏవీ రాచకొండ కమిషనరేట్ పరిధిలో లేవు. ఆయన వద్దనున్న గన్‌ను చిత్తూరు జిల్లా చంద్రగిరిలో డిపాజిట్ చేశారు. ఇప్పటికే మంచు విష్ణు, మంచు మనోజ్‌లను పిలిచి మాట్లాడాం.

ఇద్దరితోనూ బాండ్ కూడా రాయించుకున్నాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే, కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. 24వ తేదీ తర్వాత నోటీసులపై స్పందించకపోతే మోహన్‌బాబును అరెస్టు చేస్తాం" అని సీపీ వివరించారు. మరోవైపు జల్‌పల్లిలో తన నివాసం వద్ద జరిగిన ఘటనపై మోహన్‌బాబు తాజాగా మరోసారి స్పందించారు. తాను ఉద్దేశపూర్వకంగా మీడియా ప్రతినిధిని కొట్టలేదని వివరణ ఇచ్చారు. జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పారు. ఆదివారం సాయంత్రం సోమాజిగూడలోని యశోద ఆసుపత్రికి వెళ్లి.. చికిత్స పొందుతున్న జర్నలిస్టును మోహన్‌బాబు, మంచు విష్ణు పరామర్శించారు. ఈసందర్భంగా అతని కుటుంబసభ్యులకు క్షమాపణ చెప్పారు.

# బీఆర్ఎస్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం పారిపోయింది : సబితా ఇంద్రారెడ్డి

రాష్ట్రంలో 1913 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లున్నాయని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. స్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్‌పై చర్చించాలని కోరామని అన్నారు. విద్యాలయాలపై తమ ప్రశ్నను చర్చకు అనుమతించలేదని పేర్కొన్నారు. గురుకులాలు అంటే ఈ ప్రభుత్వానికి కేసీఆర్‌నే కనిపిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన గురుకులాల్లో 5 లక్షల మంది చదువుతున్నారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో ఈ ఏడాది 2 లక్షల మంది తక్కువగా చేరారని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. కేవలం 10 మంది విద్యార్థులున్న దాదాపు 4 వేల స్కూళ్లు ఉన్నాయని చెప్పారు. 10 మందికి లోపు విద్యార్థులున్న స్కూళ్ల టీచర్లను వేరే చోటికి బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. దాదాపు 6 వేల స్కూళ్లు మూసివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. కేసీఆర్ హయాంలో విద్యార్థులకు మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ ప్రభుత్వం మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ ఎత్తిసిందని అన్నారు. విషాహారం, కుక్క, పాముకాట్లతో గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై అసెంబ్లీలో బీఆర్ఎస్ అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం పారిపోయిందని అన్నారు. అటు అసెంబ్లీలో.. ఇటు బయట ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. మేం స్కూళ్లకు వెళ్లి చూస్తామంటే కూడా అనుమతించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమైందని పేర్కొన్నారు. విద్యారంగానికి సంబంధించి కాంగ్రెస్ 20 హామీలు ఇచ్చిందని తెలిపారు. కానీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని చెప్పారు. మూసివేయాలని చూస్తున్న స్కూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించాలని సూచించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com